# విశాల భారతి

తెలుగు దినపత్రిక

29-12-2025

www.vishalabharati.com
epaper.vishalabharati.com

సోమవారం, హైదరాబాద్ | సంపుటి:3 సంచిక: 359


## రాష్ట్రపతి ముర్ము సాహస యాత్ర

- భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సరికొత్త చరిత్ర సృష్టించారు
- కర్ణాటకలోనావల్ బేస్ వద్ద జలాంతర్గామిలో ప్రయాణించారు
- పశ్చిమ సముద్ర గర్భంలో జరిగిన ఈ ప్రయాణం అరుదైనది
- ఎక్కువ భాగం హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోకి వెళ్లనుంది
- సుప్రీం కమాండర్ హోదాలో జలాంతర్గామి పనితీరును పరిశీలించారు
- రాష్ట్రపతి సబ్ మెరైన్‌లో ప్రయాణించడం ఇది రెండోసారి కావడం గమనార్హం

02





# సారొస్తారొస్తారా!

## నేటి నుంచి తెలంగాణ శాసనసభ సమావేశాలు ప్రారంభం

**కేసీఆర్ అసెంబ్లీకి రావాలని సీఎం రేవంత్, మంత్రులు సవాల్**

- ఈ నేపథ్యంలో సమావేశాలకు కేసీఆర్ హాజరు కానున్నారు
- ప్రభుత్వ వ్యూహాలను తిప్పికొట్టాలని ఆయన భావిస్తున్నారు
- దీనిపై పార్టీ ముఖ్య నేతలతో కేసీఆర్ చర్చించినట్లు తెలుస్తోంది
- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై ఒత్తిడి పెంచాలని నిర్ణయం
- అయితే ఇది వేటు తప్పించుకునే ఎత్తుగడా నిపుణులు భావిస్తున్నారు

*బీఆర్ఎస్ అధినేత, ప్రతిపక్ష నాయకుడు కె. చంద్రశేఖర్ రావు అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావాలని నిర్ణయం తీసుకున్నారని సమాచారం. ఈ నెల 29వ తేదీ నుంచి ప్రారంభం కానున్న తెలంగాణ శాసనసభ సమావేశాల్లో పాల్గొనడం ద్వారా, ప్రతిపక్ష హోదాలో ప్రభుత్వ వ్యూహాలను తిప్పికొట్టాలని ఆయన భావిస్తున్నారు. అధికార పక్షం ఖరారు చేసే ఎజెండాను బట్టి తమ పోరాట పంథాను నిర్ణయించుకోవాల్సిన అవసరం ఉందని పార్టీ ముఖ్య నేతలతో కేసీఆర్ చర్చించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే కేసీఆర్ ఆదివారం సాయంత్రం ఎర్రవల్లి ఫాంహౌస్ నుంచి హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని నందినగర్ నివాసానికి చేరుకున్నారు. దాంతో కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతారు అని అంతా భావిస్తున్నారు. ముఖ్యంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై అసెంబ్లీ వేదికగా, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ యోచిస్తోంది. ఇటీవల కేసీఆర్ హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వంపై సంధించిన విమర్శలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా తనదైన శైలిలో ఘాటుగా బదులిచ్చారు.*



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

దాంతో సోమవారం ప్రారంభమయ్యే సభలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య వాడివేడి చర్చలు జరిగే అవకాశం ఉంది. కేసీఆర్ రాకతో అసెంబ్లీ వాతావరణం మరింత వేడెక్కుతుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. శాసనసభలో అతిపెద్ద ప్రతిపక్ష పార్టీ నేతకు క్యాబినెట్ మంత్రి హోదా లభిస్తుంది. ఇటీవల కేసీఆర్ చేసిన ప్రాజెక్టుల అంశం, నీటి వాటాలపై తెలంగాణ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందన్న ఆరోపణలపై సమావేశాలలో కీలకంగా చర్చ జరగనుంది. ఎవరి హయాంలో ఏం జరిగింది, తెలంగాణ ప్రాంతానికి బీఆర్ఎస్ చేసిన మేలేంటి.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధితో పాటు ఎన్నికల హామీలు అమలుపై అసెంబ్లీలో వాడివేడిగా చర్చ జరుగుతుందని తెలుస్తోంది. అయితే సబ్జెక్టుపై మాట్లాడతారా.. లేక కాలయాపన చేసి సమావేశాలు ముగిస్తారా అని తెలంగాణ ప్రజలు సోమవారం ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రెండేళ్లు గడువు ఇచ్చినా హామీలు అమలు చేయలేదని.. అమలు సాధ్యం కావని

మిగతా 3లో..

## దేశానికి గర్వకారణం 2025

**మోదీ ఆదివారం మన కీ బాత్ కార్యక్రమంలో పాల్గొన్నారు**

- దేశ ప్రజలనుద్దేశించి మోదీ ప్రసంగం నిర్వహించారు
- 2025 సంవత్సరానికి చివరి మాన్ కీ బాత్ కావడం విశేషం
- భవిష్యత్తులో దృష్టి పెట్టవలసిన అంశాలను సమగ్రంగా వివరించారు
- 2025లో సాంస్కృతికంగా బలపడినట్టు మోదీ తెలిపారు
- భారతదేశం సాధించిన ముఖ్యమైన సైనిక విజయాలను గుర్తుచేశారు
- ప్రధాని మోదీ కాశీ-తమిళ సంగమంపై చర్చించారు



**విశాలభారతి, నేషనల్:**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం 'మన కీ బాత్' కార్యక్రమంలో దేశ ప్రజలనుద్దేశించి తన ప్రసంగం నిర్వహించారు. ఈ ఎపిసోడ్ 2025 సంవత్సరానికి చివరి మాన్ కీ బాత్ కావడం విశేషం. ప్రసంగంలో, దేశం ఈ ఏడాదిలో ఎదుర్కొన్న సవాళ్లు, సాధించిన విజయాలు, భవిష్యత్తులో దృష్టి పెట్టవలసిన అంశాలను ప్రధానమంత్రి సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమం ఆకాశవాణి, దూరదర్శన్, ఎయిర్ న్యూస్ వెబ్‌సైట్, న్యూస్ ఆన్ ఎయిర్ మొబైల్ యాప్ ద్వారా ప్రసారమయ్యింది. అంతేకాక, ఎయిర్ న్యూస్, డీడీ న్యూస్, పీఎంఓ, సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ యూట్యూబ్ ఛానళ్లలో కూడా లైవ్ స్ట్రీమింగ్ ఏర్పాటు చేశారు. హిందీ ప్రసారం అనంతరం ప్రాంతీయ భాషలలోనూ ప్రసారం చేయడం ద్వారా, ఎక్కువ మంది ప్రజలకు ఈ సందేశం చేరేలా చూసారు. 2025లో భారతదేశం ఆధ్యాత్మికంగా, సాంస్కృతికంగా బలపడినట్టు ప్రధానమంత్రి మోదీ తెలిపారు. ప్రయాగ్‌రాజ్ మహాకుంభం, అయోధ్యలో రామ మందిరంలో జెండా ఆవిష్కరణ వంటి ఘన ఘటనలు ప్రతి భారతీయుడికి గర్వకారణమని పేర్కొన్నారు. స్వదేశీ ఉత్పత్తుల పట్ల ప్రజల్లో పెరిగిన ఆసక్తి, దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా భారతదేశానికి మరింత ఆత్మవిశ్వాసం లభించిందని చెప్పారు. భారతదేశం సైన్స్, అంతరిక్ష పరిశోధన రంగాల్లో గొప్ప ముందడుగు వేసిందని ప్రధాని మోదీ తెలిపారు. శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించడం ద్వారా భారత్ అంతరిక్ష పరిశోధనలో ఒక కొత్త మైలురాయిని చేరుకుంది. వన్యప్రాణి సంరక్షణలో భాగంగా, దేశంలో చీతాల సంఖ్య 30కి పైగా పెరిగినట్టు పేర్కొన్నారు. క్రీడలలోనూ 2025 సంవత్సరం చిరస్మరణీయంగా మిగిలిందని, క్రికెట్, పారాలింపిక్స్ వంటి విభిన్న రంగాల్లో త్రివర్ణ పతాకం ఎగిరిన ఘన క్షణాలను గుర్తుచేశారు. ప్రధాని మోదీ 2025లో భారతదేశం సాధించిన ముఖ్యమైన సైనిక విజయాలను గుర్తుచేశారు. ఆపరేషన్ సిందూర్‌ను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, ఇది దేశ భద్రత, సైనిక శక్తి మరియు దేశభక్తిని పెంచిన ఘటనగా అభివర్ణించారు.

మిగతా 2లో..

## 'రేవంత్ భీమవరం బుల్లోడు'

- సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు
- నేనే ఆంధ్రాలో చదివితే రేవంత్‌రెడ్డికి వచ్చిన నొప్పేంటన్నారు
- నీ అల్లుడిది భీమవరం కాదా అని కేటీఆర్ ప్రశ్నించారు
- కాంగ్రెస్ తెలంగాణలో మంచి విద్య లేకుండా చేశారని విమర్శించారు
- కాంగ్రెస్ అధికారంలో రాబందుల రాజ్యం వచ్చిందని ఎద్దేవా చేశారు
- యూరియా కోసం చెప్పల లైన్లు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు
- అడ్డమైన హామీలు ఇచ్చి మోసం చేసి గెలిచారని ఆక్షేపించారు

02



## కేసీఆర్ తేల్చుకుందాం రా

**కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది**

- కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డిఘాటుగా స్పందించారు
- అసెంబ్లీ సమావేశాలకు వస్తే లెక్కలు తేలుస్తామని సవాల్ విసిరారు
- ప్రతిపక్ష నేతకు ప్రజా సమస్యల పట్ల బాధ్యత ఉండాలని గుర్తు చేశారు
- కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా తప్పించుకుంటున్నారని విమర్శించారు
- ప్రజల సొమ్ముతో ఎంత సంపాదించావో అందరికీ తెలుసని ధ్వజమెత్తారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాజకీయాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మరోసారి తారాస్థాయికి చేరింది. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఘాటుగా స్పందించారు. కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు వస్తే, గత పదేళ్ల కాలంలో ఆయన చేసిన అప్పులు, అక్రమాలపై లెక్కలు తేలుస్తామని మంత్రి సవాల్ విసిరారు. ముఖ్యమంత్రికి ఎంత బాధ్యత ఉంటుందో, ప్రతిపక్ష నేతకు కూడా ప్రజా సమస్యల పట్ల అంతే బాధ్యత ఉంటుందని ఆయన గుర్తు చేశారు.గత 24 నెలలుగా కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా తప్పించుకుంటున్నారని కోమటిరెడ్డి విమర్శించారు. ప్రతిపక్ష నేత హోదాలో ఉండి సభకు హాజరుకాకపోవడం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. తమ ప్రభుత్వం చేసే పనులకు లెక్కలు అడిగే హక్కు కేసీఆర్‌కు లేదని, ముందుగా ఆయన హయాంలో చేసిన వేల కోట్ల అప్పుల లెక్కలు ప్రజల ముందు పెట్టాలని డిమాండ్ చేశారు. "నీ ఆస్తుల లెక్కలు చెప్పు.. ప్రజల సొమ్ముతో ఎంత సంపాదించావో అందరికీ తెలుసు" అంటూ మంత్రి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి 'బిగ్ జీరో' (సున్నా) ఇచ్చి బుద్ధి చెప్పారని, అయినా కేసీఆర్ తీరులో మార్పు రాలేదని కోమటిరెడ్డి ఎద్దేవా చేశారు.

మిగతా 2లో..

## పోలీస్ శాఖలో భారీ మార్పులు

- జీహెచ్ఎంసీ విస్తరణ తర్వాత పోలీస్ శాఖలో కీలక మార్పులు
- ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలోని మూడు పోలీస్ కమిషరేట్లు
- మూడు కమిషనరేట్లను 12 జోన్లుగా విభజించనున్నారు
- ఎక్కువ భాగం హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోకి వెళ్లనుంది
- జీహెచ్ఎంసీ పరిధి ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించింది
- రాచకొండ కమిషనరేట్ పరిధిలోకి పెద్ద జోన్లు రానున్నాయి




03



## ఆరు నెలల తర్వాత సిగాచి సీఈఓ అరెస్ట్

- సిగాచి పేలుళ్లో 54 మంది మృతి చెందిన విషయం తెలిసిందే
- ఈ కంపెనీ సీఈఓ అమిత్ రాజ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు
- అనంతరం ఆయనను కోర్టులో హాజరుపరిచారు
- అయితే ఇప్పుడు అరెస్ట్ చేయడంపై వెల్లువెత్తుతున్నాయి
- 2025 జూన్ 30వ పరిశ్రమలో రియాక్టర్ పేలుడు సంభవించింది
- ప్రమాద సమయంలోపరిశ్రమలో 143 మంది కార్మికులు ఉన్నారు
- వారిలో 61 మంది కార్మికులు ప్రాణాలతో బయటపడ్డారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రియాక్టర్ పేలి 54 మంది మృతి చెందిన సిగాచి పరిశ్రమ సీఈవో అమిత్ రాజ్ సిన్హాను పటాన్ చెరు పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. అనంతరం ఆయనను కోర్టులో హాజరుపరిచారు. ఆయనకు కోర్టు రిమాండ్ విధించింది. 2025 జూన్ 30వ తేదీన పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచీ పరిశ్రమలో రియాక్టర్ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో 54 మంది కార్మికులు మరణించారు. అంతా సజీవ దహనమయ్యారు. వారిలో కొంత మంది ఆచూకీ నేటికి లభ్యం కాలేదు. ఇక ఈ ప్రమాదంలో గాయపడిన వారు.. వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందారు. ఈ ప్రమాద సమయంలో సిగాచి పరిశ్రమలో 189 మంది కార్మికులు ఉన్నారు.

మిగతా 3లో..

## మోదీ పాలనతో ప్రమాదంలో రాజ్యాంగం

**ఘనంగా కాంగ్రెస్ 140వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు**

- మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ హాజరు
- కాంగ్రెస్ వల్లే భారత్ నిలదొక్కుకుందని వ్యాఖ్యానించారు
- మోదీ కాంగ్రెస్ సంస్కరణలను తక్కువ చేస్తున్నారని విమర్శలు
- ప్రస్తుతం రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడ్డాయన్నారు
- బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రజల గురించి ఆలోచించడం లేదని తెలిపారు
- దేశ ప్రజల హక్కుల కోసం కాంగ్రెస్ పని చేస్తూనే ఉంటుందన్నారు

02



# ‘రేవంత్ భీమవరం బుల్లోడు’

( మొదటిపేజీ తరువాయి )

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కాంగ్రెస్ సర్కార్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను ఆంధ్రాలో చదివితే రేవంత్‌రెడ్డికి వచ్చిన నొప్పేంటని ప్రశ్నించారు. మరి అప్పట్లో కాంగ్రెస్ పాలనలో మన తెలంగాణలో మంచి విద్య లేకుండా చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వంలో రైతు రాజ్యం ఉందని.. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాబందుల రాజ్యం వచ్చిందని ఎద్దేవా చేశారు. యూరియా దుకాణాల ఎదుట చెప్పుల లైన్లు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాటి రాజ్యం తెస్తామని చెబితే ఏమో అనుకున్నామని.. కానీ ఇలా చూస్తామని అనుకోలేదని విమర్శించారు కేటీఆర్. అడ్డమైన హామీలు ఇచ్చి మీ పాలమూరు బిడ్డ అని రేవంత్‌రెడ్డి మోసం చేసి గెలిచారని ఆక్షేపించారు. ఎన్నో హామీలు ఇచ్చారని.. కానీ ఇప్పుడు ఆయన అసభ్యంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి అధ్యక్షతన సర్పంచుల సన్మాన సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా కేటీఆర్ హాజరయ్యారు. మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డి,



బీరం హర్షవర్ధన్ రెడ్డి, నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. పార్టీ శ్రేణుల ఉత్సాహం చూస్తుంటే తన కడుపు నిండి పోయిందని.. కేసీఆర్ మళ్లా సీఎం అయినట్లుగా ఉందని చెప్పుకొచ్చారు.

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా కేసీఆర్ 70 టీఎంసీల రిజర్వాయర్‌లను ఐదు కట్టారని గుర్తుచేశారు. 90 శాతం పనులు పూర్తి చేసి.. ఒక పంపుకు కూడా బటన్ ఆన్ చేశారని ప్రస్తావించారు. సీఎం రేవంత్‌రెడ్డి మరి రెండేళ్లలో ఒక్క తట్టెడు మట్టి కూడా ఎందుకు తీయలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తన పాత బాస్‌కు కోపం వస్తుందనే కారణంతో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని రేవంత్‌రెడ్డి పక్కన పెట్టారని ఆరోపణలు చేశారు. 1952లో బూర్గుల రామకృష్ణారావు 150 టీఎంసీలతో అప్పర్ కృష్ణా ప్రాజెక్టుకు ప్రణాళిక సిద్ధం చేశారని అన్నారు. కానీ 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత అప్పర్ కృష్ణా ప్రాజెక్టును కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. కేసీఆర్‌కు పేరు వస్తోందనే కారణంతో పాలమూరు ప్రాజెక్టును సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని ఆరోపించారు కేటీఆర్. రేవంత్‌రెడ్డికి పాలమూరు మీద ప్రేమ లేదని... ఆయనకు భూములు, రియల్ ఎస్టేట్‌ల మీద మాత్రమే ప్రేమ ఉందని విమర్శించారు. . ప్రజల్లో ఆదరణ లేకపోవడంతోనే పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఈ ఫలితాలు వచ్చాయని ఎద్దేవా చేశారు. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎంపీటీసీ, జెడ్పీటీసీలు 32 జిల్లా పరిషత్‌లు గెలిచామని గుర్తుచేశారు. మరి ఇప్పుడు కాంగ్రెస్ ఎన్ని సర్పంచ్ స్థానాలు గెలిచిందో తెలిసిందేనని అన్నారు. రెండేళ్లలోనే ప్రజలు మళ్లీ కేసీఆర్‌కు పట్టం కట్టాలని చూస్తున్నారని చెప్పుకొచ్చారు. ఆయన పాలనలో ప్రతీ పల్లె ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. పలు ప్రాజెక్టులు ఇప్పుడు మొత్తం కంప చెట్లు మొలిచి ఆగం ఆగం అయ్యాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

నేను ఆంధ్రాలో చదివితే నీకు నొప్పయితే.. నీ అల్లుడిది భీమవరం కాదా అని కేటీఆర్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి భీమవరం బుల్లెబ్బాయ్ పేరు సరిపోతుందని తెలిపారు. మా నాయన కేసీఆర్ 1984లోనే ఎమ్మెల్యే అని గుర్తుచేశారు. ఎంఎస్ బయోటెక్నాలజీ, ఎంబీఏ చదివానని పేర్కొన్నారు. మన ఇంట్లో మనం పనిచేసుకుంటే తప్పా అని ప్రశ్నించారు. రేవంత్ ఎక్కడికి పోయినా ఆవు కథ లెక్క కేసీఆర్ మీద ఏడుస్తున్నాడని ఎద్దేవా చేశారు. రేవంత్ ఫ్రస్ట్రేషన్ చూస్తుంటే రేపోమాపో కరుస్తాడేమో అని అనిపిస్తుందని అన్నారు. రేవంత్ రెడ్డి నీకు దమ్ముంటే యూరియా బస్తాలు దొరికేలా చేస్తానని శపథం చెయ్ అని సవాలు విసిరారు. రూ. 4వేలు పెన్షన్ ఇస్తా అని శపథం చెయ్ అని అన్నారు. బంగారంలాంటి రాష్ట్రాన్ని రేవంత్ రెడ్డి నాశనం చేస్తున్నాడని మండిపడ్డారు. గతంలో ఎట్లుండే నాగర్‌కర్నూలు ఇప్పుడు ఎలా తయారైందని ప్రశ్నించారు.



# మోదీ పాలనతో ప్రమాదంలో రాజ్యాంగం

**విశాలభారతి, నేషనల్:**

కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాల వల్ల ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ నిలదొక్కుకుందని వ్యాఖ్యానించారు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే. సమాజాన్ని ముందుకు నడపడమే కాంగ్రెస్ ఆలోచన. దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఆర్ఎస్ఎస్ పాత్ర లేదు. మోదీ ప్రభుత్వం కాంగ్రెస్ తీసుకువచ్చిన సంస్కరణలను తక్కువ చేస్తోంది అంటూ ఘాటు విమర్శలు గుప్పించారు. ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ 140వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహ పలువురు కాంగ్రెస్ సీనియర్ నేతలు హాజరయ్యారు. అనంతరం, మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ..‘కాంగ్రెస్ ఏర్పాటయ్యాక, ద్వేష స్వాతంత్ర్యం కోసం ఆంగ్లేయులతో పోరాటం చేశాం. స్వతంత్ర పోరాటంలో ఎన్నో త్యాగాలు, మరెన్నో బలిదానాలు జరిగాయి. దేశానికి స్వాతంత్రాన్ని తెచ్చుకున్నాం. స్వాతంత్ర పోరాటాన్ని మహాత్మా గాంధీ ముందుండి నడిపించారు. ఆయన నేతృత్వంలో రైతులు, కూలీలు, మహిళలు కలిసి వచ్చారు. ప్రస్తుతం రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడ్డాయి. కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాల వల్ల ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ నిలదొక్కుకుంది. సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ దేశ స్వరూపాన్ని మార్చింది. ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకొని దేశాభివృద్ధి కోసం కాంగ్రెస్ పని చేసింది. సమాజాన్ని ముందుకు నడపడమే కాంగ్రెస్ ఆలోచన. మోదీ ప్రభుత్వం కాంగ్రెస్ తీసుకువచ్చిన సంస్కరణలను తక్కువ చేస్తుంది. బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రజల గురించి ఆలోచించడం లేదు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఆర్ఎస్ఎస్ పాత్ర లేదు. ప్రజల హక్కులను నాశనం చేస్తున్నారు. కాంగ్రెస్ ఆవిర్భావం నుంచి నేటి వరకు ఎన్నో ఒడిదొడుకులను చూసింది. దేశ ప్రజల హక్కుల కోసం కాంగ్రెస్ పని చేస్తూనే ఉంటుంది. ప్రజా వ్యతిరేక విధానాలపై బలంగా సమాధానం ఇవ్వాలి. రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని కాపాడడం కోసం కాంగ్రెస్ కార్యాలయం ఇందిరా భవన్ కేంద్ర బిందువు కానుంది. ప్రజాస్వామ్యం కాపాడేందుకు అందరూ కలిసి రావాలి, పెద్ద ఎత్తున పోరాటం జరగాలి. కాంగ్రెస్ కథమైంది అంటున్నారు, మా దగ్గర అధికారం లేకపోవచ్చు. కానీ, ఆలోచనలు ఆకాంక్షలు అలాగే ఉన్నాయి. కాంగ్రెస్ ధర్మం పేరుతో ఓటు అడగలేదు. కాంగ్రెస్ పోరాటం చేయకుంటే రాజ్యాంగాన్ని ఎవరు రక్షిస్తారు అని వ్యాఖ్యలు చేశారు.

స్వాతంత్ర్యానంతరం మూడు దశాబ్దాల పాటు కాంగ్రెస్ దేశ రాజకీయాల్లో ప్రధాన శక్తిగా కొనసాగింది. అయితే, కాలక్రమేణా సామాజిక మార్పులు, ప్రాంతీయ పార్టీల ఆవిర్భావం, కూటమి రాజకీయాలు కాంగ్రెస్ ఆధిపత్యాన్ని సవాల్ చేశాయి. 1984లో అపూర్వమైన మెజారిటీ సాధించిన కాంగ్రెస్, ఆ తర్వాతి దశలో పాలనాపరమైన విమర్శలు, అవినీతి ఆరోపణలు, నాయకత్వ సంక్షోభాలతో రాజకీయంగా బలహీనపడింది. 2004లో యూపీఏ ప్రభుత్వంతో పునరాగమనం చేసినా, 2014 తర్వాత జాతీయ రాజకీయాల్లో కేంద్రస్థానాన్ని కోల్పోయింది. కాంగ్రెస్ ఒక కీలక మలుపులో నిలిచింది. ఒకవైపు బలమైన అధికార పార్టీ ఆధిపత్యం, మరోవైపు మారుతున్న ఓటరు మనస్తత్వం, యువత ఆకాంక్షలు కాంగ్రెస్ ముందు కొత్త సవాళ్లుగా నిలుస్తున్నాయి. సంస్థాగత బలహీనత, స్పష్టమైన నాయకత్వ ప్రతిభ లోపించడం, ప్రాంతీయ స్థాయిలో నాయకత్వ విభేదాలు పార్టీ పునరుద్ధరణకు ఆటంకాలుగా మారాయి. అదే సమయంలో రాజ్యాంగ విలువలు, లౌకికతత్వం, సమాఖ్య వ్యవస్థ పరిరక్షణ వంటి అంశాల్లో కాంగ్రెస్ పాత్రపై ఒక వర్గం ప్రజల్లో మళ్లీ ఆశలు పునరుద్భవిస్తున్నాయి. వీటిని నెరవేర్చే దిశగా నిర్ణయాలు తీసుకోవాలి.

ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ ముందున్న అసలైన పరీక్ష.. తన చారిత్రక వారసత్వాన్ని ఆధునిక రాజకీయ అవసరాలతో అనుసంధానించడం. కేవలం స్వాతంత్ర్య ఉద్యమ పార్టీ అనే గుర్తింపుతోనే కాకుండా, సమకాలీన ఆర్థిక, సామాజిక సమస్యలకు స్పష్టమైన ప్రత్యామ్నాయ విధానాలు ప్రతిపాదించాల్సిన అవసరం ఉంది. నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, సామాజిక అసమానతలు, సమాఖ్య హక్కులు వంటి అంశాలపై ప్రజలను విశ్వసింపజేసే రాజకీయ కార్యాచరణ రూపొందించడమే పార్టీ పునరుజ్జీవనానికి మార్గం. కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం నేటి రాజకీయ పరిస్థితుల్లో ఒక ఆత్మపరిశీలన దినంగా మారాలి. స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలను ఏ విధంగా సంఘటితం చేసిందో, అదే రీతిలో నేటి ప్రజాస్వామ్య సవాళ్లను ఎదుర్కొనే ధైర్యం, దృష్టి అవసరం. భారత ప్రజాస్వామ్యానికి పునాది వేసిన పార్టీగా, కాంగ్రెస్ తన చారిత్రక బాధ్యతను గుర్తుంచుకుని, కాలానుగుణంగా మారగలిగితేనే నేటి రాజకీయాల్లో తన ప్రాధాన్యాన్ని పునరుద్ధరించుకోగలదు. అప్పుడే కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం ఒక జ్ఞాపక దినంగా కాక, ఒక కొత్త రాజకీయ ప్రయాణానికి సంకేతంగా నిలుస్తుంది.

# కేసీఆర్ తేల్చుకుందాం రా

( మొదటిపేజీ తరువాయి )

గతంలో తమకు హోదా లేకపోయినా భట్టి విక్రమార్క వంటి నేతలు అసెంబ్లీలో ప్రజా సమస్యలపై పోరాడారని, ప్రస్తుతం పార్లమెంట్‌లో మల్లికార్జున ఖర్గే గారు గట్టిగా నిలదీస్తున్నారని, మరి కేసీఆర్ ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. అసెంబ్లీలో తేల్చుకుందాం: రేపటి నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ ఖచ్చితంగా రావాలని మంత్రి కోమటిరెడ్డి సవాల్ విసిరారు. సభకు వస్తే పదేళ్లలో జరిగిన అవినీతి, అప్పులు , ఇతర అభివృద్ధి పనులపై తాము సిద్ధం చేసిన లెక్కలను కేసీఆర్ ముందు ఉంచుతామని స్పష్టం చేశారు. కేసీఆర్ కేవలం ఫాంహౌస్‌కే పరిమితం కాకుండా, ప్రతిపక్ష నేతగా తన బాధ్యతను నెరవేర్చాలని హితవు పలికారు. నేటి నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరుకానున్నారనే వార్త ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ప్రతిపక్ష నేతగా సభలో ఆయన అడుగుపెడితే అధికార కాంగ్రెస్ పార్టీని ఇరుకున పెట్టడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తెలంగాణకు రావాల్సిన నదీ జలాల వాటాలో కేంద్రం వివక్షను, రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని అసెంబ్లీ వేదికగా ఎండగట్టాలని కేసీఆర్ నిర్ణయించారు. కాంగ్రెస్ పార్టీ చరిత్ర పొడవునా తెలంగాణకు ద్రోహం చేస్తూనే వచ్చిందని, ఇప్పటి ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోందని ఆయన విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం రాష్ట్రవ్యాప్తంగా భారీ బహిరంగ సభలు నిర్వహించి.. ప్రజలను చైతన్యపరచాలని



పార్టీ శ్రేణులకు ఆదేశాలిచ్చారు.

పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పనుల్లో జరుగుతున్న జాప్యం, కేంద్రం నుంచి రావాల్సిన అనుమతులపై రాష్ట్ర ప్రభుత్వం సరిగ్గా ఒత్తిడి తీసుకురావడంలో విఫలమైందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. దీనిపై ప్రజల్లోకి వెళ్లడం ద్వారా దక్షిణ తెలంగాణలో పార్టీని మళ్ళీ బలోపేతం చేయవచ్చని కేసీఆర్ భావిస్తున్నారు. కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులను బోర్డు పరిధిలోకి తీసుకురావడాన్ని కేసీఆర్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీనివల్ల రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటాయని.. ఈ విషయాన్ని ప్రజలకు బలంగా వివరించాలని ఆయన ప్లాన్ చేస్తున్నారు. కేసీఆర్ ఈసారి విమర్శలకే పరిమితం కాకుండా.. మళ్ళీ ఉద్యమ తరహా పోరాటాన్ని నిర్మించాలని చూస్తున్నారు. కేసీఆర్ అసెంబ్లీకి వస్తున్నారన్న వార్త బీఆర్ఎస్ కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

# దేశానికి గర్వకారణం 2025

( మొదటిపేజీ తరువాయి )

ఉగ్రవాదంపై చూపిన ధైర్యం, స్వదేశీ ఆయుధాలు, ఆధునిక టెక్నాలజీ వినియోగం ద్వారా సాధించిన విజయాలను కూడా ప్రధానమంత్రి ప్రశంసించారు. ప్రధానమంత్రి మోదీ ప్రసంగంలో కాశ్మీర్‌లోని జమ్మూ కాశ్మీర్ బారాముల్లా జిల్లాలోని జెహన్‌పోరా ప్రాంతం గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. అక్కడ ఉన్న ఎత్తైన మట్టిగుట్టలపై శాస్త్రీయ అధ్యయనం చేసినపుడు, అవి సహజంగా ఏర్పడినవేమో కానీ పురాతన కాలంలో నిర్మించిన పెద్ద కట్టడాల అవశేషాలు అని తేలింది. అదనంగా, ఫ్రాన్స్‌లోని ఒక మ్యూజియం ఆర్కైవ్‌లో బారాముల్లాకు సంబంధించిన పాత చిత్రాన్ని గుర్తించారు. ఆ చిత్రంలో మూడు బౌద్ధ స్తూపాలు కనిపించడం వల్ల, కాశ్మీర్‌కు చెందిన గొప్ప చారిత్రక వారసత్వం ప్రపంచానికి వెలుగులోకి వచ్చింది.

‘మన కీ బాత్’ 129వ ఎడిషన్‌లో ప్రధాని మోదీ కాశీ–తమిళ సంగమంపై చర్చించారు. వారణాసిలో ఈ ఏడాది జరిగిన కార్యక్రమాల్లో, యువతలో తమిళ భాషపై ఆసక్తిని పెంపొందించడానికి ప్రత్యేక ప్రచారం చేపట్టారు. ‘తమిళం నేర్చుకుందాం – తమిళ కలాకలమ్’ అనే థీమ్‌తో 50కి పైగా పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ప్రపంచంలోనే అత్యంత ప్రాచీన భాషల్లో ఒకటిగా తమిళాన్ని గుర్తించి, దేశవ్యాప్తంగా యువతలో ఈ భాషపై పెరుగుతున్న ఆసక్తిని భారత ఐక్యతకు నిదర్శనంగా పేర్కొన్నారు. ప్రధాన మంత్రి మోదీ మాట్లాడుతూ, యువత తరచూ తమ ఆలోచనలు ఎలా పంచుకోవాలో అడుగుతారన్నారు. దీనికి పరిష్కారంగా ‘వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్’ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. వచ్చే నెల 12న స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవం జరుపుకోబోతోంది. ఆరోజు,



ప్రధాన మంత్రి ఈ కార్యక్రమంలో వ్యక్తిగతంగా పాల్గొననున్నారని కూడా తెలిపారు. ‘ఎక్కడ సంకల్పం ఉంటే అక్కడ మార్గం ఉంటుంది’ అన్న మాటను మణిపూర్‌కు చెందిన మొయిరాంగ్‌థెం సేత్ నిజం చేశారని ప్రధాని తెలిపారు. విద్యుత్ సమస్యలతో బాగా బాధపడుతున్న ప్రాంతంలో సౌరశక్తిని వినియోగిస్తూ స్థానిక పరిష్కారాలను చూపిన సేత్ కృషిని ప్రధానమంత్రి ప్రశంసించారు. దీనితో పాటు, సౌరశక్తికి ప్రభుత్వం రూ.80 వేల సబ్సిడీ అందిస్తున్నట్టు గుర్తుచేశారు. ప్రధానమంత్రి గిర్ అడవుల్లో ఆసియాటిక్ సింహాల సంఖ్య పెరగడం, మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి, మహిళా సాధికారత వంటి అంశాలను ప్రస్తావించారు. ‘వోకల్ ఫర్ లోకల్’ కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేయాలని, దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. 129వ మాన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ 2025లో భారతదేశం సాధించిన ఘన విజయాలను, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, సైనిక, సాంకేతిక, పర్యావరణ రంగాల్లో ఏర్పడిన పురోగతిని విశ్లేషించారు. ఈ ప్రసంగం దేశ ప్రజలకు గర్వకారణంగా నిలిచేలా, భవిష్యత్తులో ముందడుగులు వేయడానికి ప్రేరణగా నిలిచింది.

# పోలీస్ శాఖలో భారీ మార్పులు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

జీహెచ్ఎంసీ విస్తరణ తర్వాత పోలీస్ శాఖలో కీలక మార్పులు జరుగుతున్నాయి. ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలోని మూడు పోలీస్ కమిషనరేట్లలో భారీ ప్రక్షాళన ఉండబోనుంది. మూడు కమిషనరేట్లను 12 జోన్లుగా విభజించనున్నారు. అందులో ఎక్కువ భాగం హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోకి వెళ్లనున్నట్లు తెలుస్తోంది. జీహెచ్ఎంసీ పరిధి ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించింది. గతంలో ఉన్న జీహెచ్ఎంసీ పరిధి అమాంతంగా పెరిగింది. పరిధి పెరగడంతో పోలీసు కమిషనరేట్లలోనూ కీలక మార్పులు జరగనున్నాయి. కొత్తగా విస్తరించిన జీహెచ్ఎంసీని 12 జోన్లుగా చేయనున్నారు. అందులో హైదరాబాద్ కమిషనరేట్‌కు ఆరు జోన్లు, సైబరాబాద్‌కు మూడు జోన్లు, రాచకొండ కమిషనరేట్‌ను మరో మూడు జోన్లు ఉండనున్నాయి. ఇందులోభాగంగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోకి శంషాబాద్, రాజేంద్రనగర్ జోన్లు వెళ్లాయి. దీంతో చార్మినార్, గోల్కొండ, ఖైరతాబాద్, సికింద్రాబాద్ జోన్లు హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఉండనున్నాయి. ఇక సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో మార్పులు జరిగాయి. గతంలో శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ ఉన్నాయి. ఇప్పుడు మొయినాబాద్ నుంచి పటాన్‌చెరు వరకు శేరిలింగంపల్లి జోన్ విస్తరించింది. మాదాపూర్‌ను కూకట్‌పల్లి జోన్‌లో కలిపేశారు. గతంలో ఉన్నమాదిరిగానే కుత్బుల్లాపూర్ అలాగే ఉంచారని తెలుస్తోంది.

రాచకొండ కమిషనరేట్ పరిధిలోకి పెద్ద జోన్లు రానున్నాయి. వాటిలో ఎల్బీనగర్, మల్కాజ్‌గిరి, ఉప్పల్ జోన్లు ఉన్నాయి. గతంలో ఈ కమిషనరేట్ పరిధిలో యాదాద్రి జిల్లా ఉండేది. తాజాగా యాదాద్రి జిల్లా సెపరేట్ చేసి జిల్లా ఎస్పీ పరిధిలోకి రానుంది. మహేశ్వరం జోన్, షాద్ నగర్, చేవెళ్ల జోన్లను కలుపుతూ ‘ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్’గా ఏర్పాటు చేయాలన్నది పోలీసు శాఖ ఆలోచనగా తెలుస్తోంది. గతంలో సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లు కొత్తగా ఏర్పడ్డాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత జీహెచ్ఎంసీ పరిధి పెరగడంతో లా అండ్ ఆర్డర్ మరింత పటిష్టం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై పోలీసులు అధికారులతో శనివారం




డీజీపీ సమావేశమయ్యారు. అన్ని కోణాల్లో చర్చించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై రేపో మాపో జోన్లపై డీజీపీ ఉత్తర్వులు ఇవ్వనున్నారని పోలీసులు వర్గాలు చెబుతున్నాయి. క్రైమ్ ఎక్కడైతే ఎక్కువగా జరుగుతుందో వాటిని జోన్లుగా డివిజన్ చేశారు. ఆ ప్రాంతాల్లో ప్రత్యేక అధికారులను నియమించనున్నారు. దీనివల్ల క్రైమ్ రేటు తగ్గే అవకాశముందని భావిస్తోంది.

జీహెచ్ఎంసీ అద్భుత కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. హైదరాబాద్‌ను సుందర నగరంగా మార్చేందుకు భారీ పారిశుద్ధ్య కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అదే మెగా శానిటేషన్ డ్రైవ్. డిసెంబర్ 29వ తేదీ నుంచి జనవరి 31 వరకు నెల రోజుల పాటు ఈ డ్రైవ్ జరగనుంది. హైదరాబాద్‌లో దాదాపు కోటి మందికిపై ప్రజలు జీవిస్తున్నారు. ప్రజలు 24 గంటలు రోడ్లపై విహరిస్తూ ఉంటారు. దీంతో రోడ్లపై చెత్తాచెదారం ఎక్కువగా ఉంటుంది. నూతన సంవత్సరం వస్తున్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ ఈ కార్యక్రమం చేపట్టడం గమనార్హం. హైదరాబాద్‌లో వార్డుల పునర్విభజన చేపట్టిన విషయం తెలిసిందే. అది చేపట్టిన తర్వాత చేపడుతున్న మొదటి పెద్ద కార్యక్రమం ఇదే. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతీరోజు 300 వార్డుల్లో పారిశుద్ధ పనులు చేపట్టనున్నారు. వార్డుల్లో ఎప్పటి నుంచో పేరుకుపోయిన చెత్తను దీని ద్వారా తొలగించనున్నారు. అలాగే భవనాలు, ఇళ్లు కూల్చివేతలు చేపట్టిన సమయంలో పేరుకుపోయిన వ్యర్థాలను కూడా తొలగించనున్నారు. ఇక పార్కులు, ఫుట్‌పాత్‌లపై ఉన్న చెత్తాచెదారాలను కూడా శుభ్రం చేయనున్నారు. ప్రజలు తరచుగా చెత్త వేసే ప్రదేశాలను గుర్తించడం, అక్కడ చెత్త వేయకుండా మొక్కలు నాటడం, గోడలకు రంగులు వంటి పనులను చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఫ్లైఓవర్లు, మెట్రో పిల్లర్ల మధ్య కూడా క్లీనింగ్ పనులను జీహెచ్ఎంసీ చేపట్టనుంది. ఇక రోడ్లపై చెత్తచెదారం వేయడం వల్ల దోమల వ్యాప్తి చెందుతున్నారు. దీని వల్ల ప్రలు డెంగ్యూ, మలేరియా వంటి రోగాల బారిన పడుతున్నారు. ఇటీవల నగరంలో డెంగ్యూ కేసులు పెరుగుతున్నాయి. వర్షాకాలంలో డెంగ్యూ కేసులు మరింతగా పెరుగుతున్నాయి. దీంతో పాటు నగరాన్ని సుదరంగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమాన్ని జీహెచ్ఎంసీ చేపడుతోంది.

# రాష్ట్రపతి ముర్ము సాహస యాత్ర

**విశాలభారతి, నేషనల్:**

భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆదివారం కర్ణాటకలోని కార్వార్ నావల్ బేస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించారు. భారత నౌకాదళానికి చెందిన స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన 'ఐఎన్ఎస్ వాగ్‌షీర్' సబ్ మెరైన్ (జలాంతర్గామి)లో ఆమె ప్రయాణించారు. పశ్చిమ తీరంలో సముద్ర గర్భంలో జరిగిన ఈ ప్రయాణం ఎంతో అరుదైనది. దేశ రక్షణ దళాల సుప్రీం కమాండర్ హోదాలో ఆమె జలాంతర్గామి పనితీరును, అక్కడి సిబ్బంది సేవలను దగ్గరుండి పరిశీలించారు. నౌకాదళ అధిపతి అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠి ఆమె వెంటే ఉండి ఆపరేషన్ వివరాలు వివరించారు. దేశ చరిత్రలో ఒక రాష్ట్రపతి సబ్ మెరైన్‌లో ప్రయాణించడం ఇది రెండోసారి కావడం గమనార్హం. ఇంతకు ముందు ఏపీజే అబ్దుల్ కలాం మాత్రమే ఈ సాహసం చేశారు. ఈ పర్యటన ద్వారా నౌకాదళ సిబ్బందికి ఆమె అండగా నిలిచారు. క్లిష్టమైన వాతావరణంలో పనిచేసే సైనికులకు ఆమె రాక గొప్ప స్ఫూర్తినిచ్చింది. ఐఎన్ఎస్ వాగ్‌షీర్ అనేది మన దేశంలోనే తయారైన అత్యాధునిక 'కల్వరి' తరగతికి చెందిన జలాంతర్గామి. సముద్రం అడుగున ఉండే క్లిష్ట పరిస్థితుల్లో మన నావికా దళం ఎలా విధులు నిర్వర్తిస్తుందో తెలుసుకోవడానికి ఈ పర్యటన దోహదపడింది. సబ్ మెరైన్ లోపల ఉండే సాంకేతికతను, సిబ్బంది సామర్థ్యాన్ని రాష్ట్రపతి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. నీటి అడుగున శత్రువుల కంట పడకుండా, ఎక్కువ రోజులు సముద్రంలో గడపడం ఎంత సవాలుతో కూడుకున్నదో ఆమె గమనించారు. భారత రక్షణ చరిత్రలో ఇలాంటి సంఘటన జరగడం చాలా అరుదు. 2006లో అప్పటి రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 'ఐఎన్ఎస్ సింధురక్షక్'లో ప్రయాణించారు. ఆ తర్వాత దాదాపు రెండు దశాబ్దాలకు ఇప్పుడు ద్రౌపదీ ముర్ము ఆ సాహసం చేశారు. దీని ద్వారా జలాంతర్గామిలో ప్రయాణించిన తొలి మహిళా రాష్ట్రపతిగా ఆమె రికార్డు సృష్టించారు. త్రివిధ దళాధిపతి హోదాలో ఆమె ఇలాంటి సాహసోపేతమైన పర్యటన చేయడం సైనికుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ పర్యటన వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైన పశ్చిమ తీరంలో జరిగింది. కర్ణాటకలోని కార్వార్ నౌకా కేంద్రం ఆసియాలోనే అతిపెద్ద నౌకాదళ స్థావరాల్లో ఒకటి కావడం విశేషం. హిందూ మహాసముద్రంలో మన రక్షణ వ్యవస్థను బలోపేతం చేయడంలో ఐఎన్ఎస్ వాగ్‌షీర్ లాంటి జలాంతర్గాములు ముఖ్య పాత్ర పోషిస్తాయి. దేశ రక్షణ కోసం రేయింబవళ్లు శ్రమిస్తున్న నావికా దళానికి రాష్ట్రపతి పర్యటన గొప్ప గుర్తింపునిచ్చింది. గతంలో రాష్ట్రపతి ముర్ము శక్తిమంతమైన రఫేల్ యుద్ధవిమానంలో విహరించి చరిత్ర సృష్టించారు. హరియాణాలోని అంబాలా వైమానిక స్థావరం నుంచి ఆమె ప్రయాణించారు. ఎయిర్ ఫోర్స్ అధిపతి మార్షల్ ఏపీ సింగ్ ప్రత్యక్షంగా వీక్షించారు. రఫేల్ జెట్‌లోకి ఎక్కేముందు ఆమె జీ సూట్ ధరించారు. చేతిలో హెల్మెట్ పట్టుకుని,



సన్‌గ్లాసెస్ ధరించిన ముర్ము, పైలట్‌తో ఫొటో దిగారు. అయితే గగనవిహారం అనంతరం కొద్ది సేపటి తర్వాత ముర్ము యథాస్థానానికి క్షేమంగా చేరుకున్నారు. రఫేల్‌లో గగనవిహారం మరపురాని అనుభవమని ముర్ము తెలిపారు. శక్తివంతమైన రఫేల్‌లో ప్రయాణించడం, దేశ రక్షణ సామర్థ్యాలపై నూతన గర్వాన్ని నింపిందని ఆమె ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈ విన్యాసాన్ని విజయవంతంగా నిర్వహించిన భారత వైమానిక దళం బృందాన్ని అభినందిస్తున్నాట్లు రాష్ట్రపతి పేర్కొన్నారు.

మరో ప్రత్యేకత ఏమిటంటే, వారణాసిలో జన్మించిన స్క్వాడ్రన్ లీడర్ శివంగి సింగ్ అంబాలా వైమానిక దళ స్థావరంలో అధ్యక్షురాలు ద్రౌపది ముర్ముతో కలిసి పోజులిచ్చారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో తాను పట్టుబడ్డానని పాకిస్తాన్ సోషల్ మీడియా వాదనలను ఆ విధంగా ఆమె తోసిపుచ్చారు. రాఫెల్ యుద్ధ విమానాన్ని నడిపిన తొలి మహిళా పైలట్ సింగ్, రాష్ట్రపతికి విమానాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. సింగ్ విమానాలతో సహా ఆరు భారతీయ జెట్‌లను కూల్చివేసినట్లు పాకిస్తాన్ చేసిన వాదనలు అవాస్తవమని భారత అధికారులు నిర్ధారించారు, అయితే పాకిస్తాన్ వాస్తవానికి దాని స్వంత విమానాలను కోల్పోయింది. సింగ్ “దుఃఖంలో మునిగిపోయిన కుటుంబం” గురించి సోషల్ మీడియాలో ప్రసారం చేసిన వీడియోలు సంబంధం లేనివి, బదులుగా సార్జెంట్ సురేంద్ర కుమార్ కుటుంబాన్ని చూపిస్తున్నాయి. ఈ ఏడాది పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌పై భారత్ జరిపిన దాడుల్లో (ఆపరేషన్ సిందూర్) రఫేల్ జెట్లు కీలక పాత్ర పోషించాయి. ఈ జెట్‌లు అత్యంత కచ్చితత్వంతో పాక్‌లోని ఉగ్రస్థావరాలను మట్టికరిపించాయి. అయితే ఆపరేషన్ సిందూర్‌కు 6 నెలల తర్వాత రాష్ట్రపతి యుద్ధవిమానంలో గగనవిహారం చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. అంతకుముందు రాష్ట్రపతి ఎయిర్‌బేస్‌లో భారత వాయుసేన నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

# హైటెక్స్‌లో క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీ షో

- ఫిబ్రవరి 6–8 నిర్వహణ
- 'శాశ్వతంగా స్థిరపడండి' నినాదంతో
- కొనుగోలుదారులకు పిలుపు

**విశాలభారతి, హైదరాబాద్ :**

దేశంలోని ప్రైవేట్ రియల్ ఎస్టేట్ డెవలపర్ల అత్యున్నత సంస్థ క్రెడాయ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీ షో-2026ను ఫిబ్రవరి 6 నుంచి 8 వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్లో నిర్వహించనున్నట్లు ప్రకటించింది. విశ్వసనీయత, పారదర్శకత, నైతిక విలువలనే ప్రాతిపదికగా చేసుకొని ఈ ప్రాపర్టీ షోను నిర్వహిస్తున్నట్లు క్రెడాయ్ హైదరాబాద్ వెల్లడించింది. ఈ ఏడాది ప్రాపర్టీ షోకు 'శాశ్వతంగా స్థిరపడండి' అనే నినాదాన్ని ఎంచుకున్నారు. హైదరాబాద్‌ను పెట్టుబడులకు మాత్రమే కాకుండా, దీర్ఘకాలిక నివాసానికి భద్రమైన నగరంగా నిలబెట్టే లక్ష్యంతో ఈ ప్రాపర్టీ షో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎన్. జైదీప్ రెడ్డి, ప్రెసిడెంట్-ఎలెక్ట్ బి. జగన్నాథ్ రావు, జనరల్ సెక్రటరీ కె. క్రాంతి కిరణ్ రెడ్డి, ప్రాపర్టీ షో కన్వీనర్ సుశీల్ కుమార్ జైన్, కో-కన్వీనర్ ఎన్. వేణుగోపాల్‌తో పాటు మేనేజింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**రెరా–ఆమోదిత ప్రాజెక్టులే ప్రదర్శన**

క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీ షోను పూర్తిగా గృహ కొనుగోలుదారుల కేంద్రంగా రూపొందించారు. క్రెడాయ్ సభ్య డెవలపర్లకు చెందిన రెరా-ఆమోదిత ప్రాజెక్టులనే ప్రదర్శనలో ఉంచుతారు. అపార్ట్‌మెంట్లు, విల్లాలు, ప్లాటెడ్ డెవలప్‌మెంట్లు, కార్యాలయ స్థలాలు వంటి నివాస, వాణిజ్య ప్రాజెక్టులు హైదరాబాద్ అంతటా ప్రదర్శించనున్నారు. ధృవీకరించబడిన ప్రాజెక్టులు మాత్రమే ఒకేచోట అందుబాటులో ఉండటంతో కొనుగోలుదారులకు నమ్మకం, పారదర్శకత కలుగుతుందని క్రెడాయ్ హైదరాబాద్ తెలిపింది.







**దృఢమైన హైదరాబాద్ మార్కెట్...**

ఈ సందర్భంగా అధ్యక్షుడు ఎన్. జైదీప్ రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం బలమైన ప్రాథమిక అంశాలతో ముందుకు సాగుతోందన్నారు. ఇటీవల జరిగిన జిహెచ్ఎంసి, హెచ్ఎండిఏ భూముల వేలాలు నగరాన్ని దేశంలోని ప్రీమియం భూమి మార్కెట్లలో ఒకటిగా నిలిపాయని తెలిపారు. కోకాపేట్-నియోపోలిస్, రాయదుర్గం, బాచుపల్లి వంటి ప్రాంతాల్లో డిమాండ్ కొనసాగుతుండటంతో భవిష్యత్‌లో ధరలు మరింత పెరిగే అవకాశముందని పేర్కొన్నారు.

**బ్రాండ్ హైదరాబాద్‌కు ప్రపంచ గుర్తింపు...**

ప్రెసిడెంట్-ఎలెక్ట్ బి. జగన్నాథ్ రావు మాట్లాడుతూ, హైదరాబాద్ కేవలం ఐటీ నగరంగా కాకుండా జీవనశైలి, పెట్టుబడులకు ప్రపంచ స్థాయి గమ్యస్థానంగా ఎదుగుతోందన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ద్వారా ఏర్పడిన పెట్టుబడుల వాతావరణం నగర భవిష్యత్ వృద్ధికి బలమైన పునాది వేసిందని తెలిపారు.

**స్థిరమైన పట్టణాభివృద్ధిపై దృష్టి...**

జనరల్ సెక్రటరీ కె. క్రాంతి కిరణ్ రెడ్డి మాట్లాడుతూ, ప్రాపర్టీ షోలో కుటుంబ, వెల్నెస్ జోన్‌లు, సీనియర్-ఫ్రెండ్లీ ప్రాంతాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రెరా-ఆమోదిత క్రెడాయ్ సభ్యుల ప్రాజెక్టులే ప్రదర్శించబడతాయని స్పష్టం చేశారు. విశ్వసనీయత, నాణ్యతకు ప్రతీకగా నిలిచిన ఈ ప్రాపర్టీ షోను గృహ కొనుగోలుదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.



# గ్రామాల అభివృద్ధి సర్పంచుల బాధ్యత

**చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య**

**మొయినాబాద్, విశాలభారతి:**

మొయినాబాద్ మండల పరిధిలో గ్రామాల సమగ్ర అభివృద్ధికి సర్పంచులు కీలక పాత్ర పోషించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. ఆదివారం కుత్బుద్దీన్గూడ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కుత్బుద్దీన్గూడ గ్రామ సర్పంచ్ మహమ్మద్ పాషా టీఆర్ఎస్ పార్టీని వీడి ఎమ్మెల్యే కాలే యాదయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు ఎమ్మెల్యే కాలే యాదయ్య పూలమాలలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే కుత్బుద్దీన్ కూడా కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధి బాధ్యత సర్పంచులదేనని, అధికార పార్టీలో ఉంటే ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామాలకు సులభంగా తీసుకురావచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో ఎక్కువ మంది సర్పంచులు కాంగ్రెస్ అభ్యర్థులే గెలుపొందిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేసి గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన్, మాజీ జెడ్పీటీసీ కాలే శ్రీకాంత్, చందానగర్ మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, మండల పరిషత్ మాజీ కోఆప్షన్ మెంబర్, చందానగర్ సర్పంచ్ తోక మురళీకృష్ణ గౌడ్, సర్పంచ్ రవీందర్, వార్డ్ సభ్యులు ఈశ్వర్, సలాం, జయంతిన్, గ్రామ నాయకులు అబ్దుల్ అలీ, షబ్బీర్ హుస్సేన్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

# సారొస్తారొస్తారా!

( మొదటిపేజీ తరువాయి )

తెలిసినా 420 హామీలిచ్చి ఓట్లు వేయించుకుని ప్రజల్ని మోసం చేశారని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కేసీఆర్ ఇటీవల విమర్శలు గుప్పించారు. రైతు బంధు ఎగ్గొట్టిన ప్రభుత్వం అన్నదాతలకు కనీసం యూరియా బస్తాలు ఇవ్వలేని చేతకాని స్థితిలో ఉందని సెటైర్లు వేశారు. మహిళలకు పైసలు ఇవ్వలేదు, కానీ లక్ష మందిని కోటీశ్వరులు చేస్తామని గొప్పలకు పోతున్నారని విమర్శించారు. ఉద్దేశపూర్వకంగానే తాము కట్టిన ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేయకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నారు. వరి సాగులో దేశంలోనే నెంబర్ వన్ గా నిలిచిన రాష్ట్రం మళ్లీ అన్ని పంటలలో వెనక్కి పోయిందన్నారు.

పెన్షన్లు పెంచుతామని హామీలిచ్చి వృద్ధులను మోసం చేయడం కాంగ్రెస్ పార్టీకి చెల్లిందన్నారు. పాలన సక్కగ చేయమంటే నా చావు కోరుకోవడం ఏంటో తనకు అర్థం కావడం లేదని కేసీఆర్ మండిపడ్డారు. కృష్ణా జలాల్లో మన వాటా దక్కించుకోవడానికి కూడా చేతకాని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వ నేతలు ఉన్నారని, మళ్లీ పాత రోజులు, కరువు, వలసల్ని తీసుకొస్తున్నారని ప్రతిపక్షనేత ఆరోపించారు. సీఎం రేవంత్ సొంత జిల్లా ఉమ్మడి పాలమూరు. అలాగే కేసీఆర్ ఒకప్పుడు ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన జిల్లా పాలమూరు. 2009లో ఆయన మహబూబ్ నగర్ ఎంపీగా ఎన్నికయ్యారు. ఆ హోదాలోనే తెలంగాణ సాధించారు. ఇక రేవంత్ టీడీపీ తరపున 2009లోనే తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. తర్వాత రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆయన కాంగ్రెస్ లో చేరారు. సీఎం అయ్యారు. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో రేవంత్ ను టార్గెట్ చేశారు. పలు కేసులు నమోదు చేశారు. రేవంత్ కాంగ్రెస్ లోకి వచ్చాక 2018 తర్వాత రాజకీయ విభేదాలు మరింత తీవ్రం అయ్యాయి. 2023లో బీఆర్ఎస్ ను ఓడించి రేవంత్ సీఎం అయి తన చిరకాల కోరిక నెరవేర్చుకున్నారు. అయితే, రేవంత్ సీఎం అయి కేసీఆర్ ప్రతిపక్ష నేతగా మారాక అసెంబ్లీలో ఇద్దరూ తలపడితే ఎలా ఉంటుందో చూడాలని చాలామంది భావించారు. ఇప్పుడు దీనికి పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం అవకాశం కల్పించేలా ఉంది. ఈ ప్రాజెక్టు అంశమై జరుగుతున్న అన్యాయంపై కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిలదీయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. అసెంబ్లీకి గైర్హాజరుతో కేసీఆర్ పై అనర్హత వేటు పడుతుందనే వాదన గతంలో వినిపించింది. దీనికి సంబంధించి చర్చలు కూడా జరిగాయి. ఈ నేపథ్యంలోనే ఆయన సోమవారం అసెంబ్లీకి హాజరై వేటు ముప్పును తప్పించుకునే చాన్సుంది. అయితే, సమావేశాలు 15 రోజులు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలంటూ ఎమ్మెల్యేలకు కేసీఆర్ నిర్దేశించారు. ఇక ఆయన స్వయంగా ఎన్ని రోజులు సమావేశాల్లో పాల్గొంటారో చూడాలి.



# ఆరు నెలల తర్వాత సిగాచి సీఈఓ అరెస్ట్

( మొదటిపేజీ తరువాయి )

ఈ ప్రమాదంలో మృతదేహాలు గుర్తిపట్టలేనంతగా కాలిపోయాయి. ఈ నేపథ్యంలో ఆయా మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహించారు. ఆ తర్వాత మృతదేహాలను వారి వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. అయితే ఈ ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన జరిగి దాదాపుగా కొన్ని నెలలు కావస్తున్నా.. నేటికి సిగాచి పరిశ్రమ సీఈవో అమిత్ రాజ్ సిన్హాను అరెస్ట్ చేయకపోవడంతో ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలు విషయానికి వస్తే హైదరాబాద్ శివారు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారంలో సిగాచీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ పరిశ్రమలో ఈ ఏడాది జూన్ 30వ తేదీన భారీ విస్ఫోటనం సంభవించిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో 54 మంది కార్మికులు మృతి చెందారు. పేలుడు జరిగినప్పుడు ఏకంగా 700 నుంచి 800 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండగా, అక్కడ పని చేస్తున్న వారిలో ఐదుగురు సజీవ దహనమయ్యారు. ప్రమాద తీవ్రతకు పరిశ్రమ భవనంలో 14 అంగుళాల మందంతో ఉన్న ప్లింత్ బీమ్‌లు సైతం విరిగి, కుప్పకూలిపోవడంతో నష్ట తీవ్రత భారీగా పెరిగింది. ఈ ఘటన జరిగినప్పుడు 11 ఫైర్ ఇంజిన్‌లతో మంటలను అదుపు చేశారంటే ప్రమాద తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రమాదం జరిగిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ కంపెనీ నిర్లక్ష్యం వల్లనే ఈ ప్రమాదం సంభవించిందని తన నివేదికలో పేర్కొంది.

ఈ ప్రమాదంలో పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ ఇలంగోవన్ చనిపోయారు. ప్రమాద తీవ్రతకు ఆయన మృతదేహం 50 మీటర్ల దూరం వరకు ఎగిరి పడిందంటే పరిస్థితి తీవ్రత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. సిగాచీ పరిశ్రమ గుజరాత్ కేంద్రంగా పని చేస్తోంది. తెలంగాణ, మహారాష్ట్రల్లో ఈ సంస్థ పరిశ్రమలు ఉన్నాయి. పాశమైలారంలోని పారిశ్రామికవాడలో దాదాపు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఈ ఔషధ తయారీ కేంద్రం నెలకొల్పారు. ఇక్కడ ముడి సరకును శుద్ధి చేసి, మైక్రో క్రిస్టలైన్ సెల్యులోజ్ అనే ఔషధాన్ని తయారు చేస్తారు. దీన్ని వివిధ ఔషధ తయారీ సంస్థలకు విక్రయిస్తారు. ఈ పరిశ్రమలో నాలుగు బ్లాక్‌లు ఉన్నాయి. ఇక్కడ మొత్తం 189 మంది సిబ్బంది పని చేస్తున్నారు. వీరిలో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వారే ఎక్కువగా పని చేస్తున్నారు. ఆ రోజు ఉదయం 8 గంటల ప్రాంతంలో సిబ్బంది అంతా విధులకు హాజరు కాగా, కాసేపటికే స్ప్రేయర్ డ్రయ్యర్ ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలింది. ఏం జరిగిందో తెలిసేలోపు జరగాల్సిన నష్టం అంతా జరిగిపోయింది. ఈ ప్రమాదంలో 54 మంది చనిపోయారు.

ఆచూకీ లభించని 8 మంది కార్మికుల కుటుంబాలకు తక్షణ సాయం కింద ఒక్కో బాధితుడి కుటుంబానికి రూ.15 లక్షలు చొప్పున పరిహారం అందించారు. వారికి రవాణాభత్యం కింద రూ.10 వేలను ఇచ్చారు. ఈ ప్రమాదంపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సహాయక చర్యలను పర్యవేక్షించారు. సిగాచీ పరిశ్రమ మృతుల కుటుంబాలకు ఆ కంపెనీ రూ.కోటి పరిహారం ప్రకటించింది. పాశమైలారం పారిశ్రామిక వాడలో సిగాచీ పరిశ్రమ పేలుడు సమయంలో ఒకేసారి 700 నుంచి 800 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండటంతో ఇంతటి భారీ నష్టం సంభవించిందని అధికారులు అంచనా వేశారు. దీనికి ముఖ్య కారణం బ్లో ఎయిర్ హ్యాండ్లర్‌ను శుభ్రం చేయడంలో నిర్లక్ష్యమేనని తేల్చారు. దుమ్ము పేరుకుపోయిన డ్రయ్యర్‌లో ఉష్ణోగ్రతలు అదుపులోకి తీసుకోకపోవడంతో పేలుడుకు దారి తీసి ఉంటుందని అంచనాకు వచ్చారు.



# ఏఐ మనతో నడవడానికి వచ్చింది

**డాక్టర్ జి ఎన్ ఆర్ ప్రసాద్, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్, సిబిఐటి, హైదరాబాద్**

**హైదరాబాద్, విశాలభారతి:**

ఈ రోజుల్లో కృత్రిమ మేధస్సు గురించి మాట్లాడితే చాలామందికి భయం కలుగుతోంది. ఏఐ మన ఉద్యోగాలను తీసుకుపోతుందా?", "మన స్థానాన్ని భర్తీ చేస్తుందా?" అనే ప్రశ్నలు సాధారణమయ్యాయి. కానీ నిజం ఏమిటంటే —— ఏఐ మన స్థానాన్ని దక్కించుకోవడానికి కాదు; మనతో పాటు నడవడానికి వచ్చింది. సాఫ్ట్ వేర్ నుంచి స్నేహితుడిగా : గతంలో సాఫ్ట్ వేర్ అనేది కేవలం మనం చెప్పిన పనిని చేసే సాధనంగా ఉండేది. కానీ ఏఐ అలాంటిది కాదు. ఇది మన మాట వింటుంది, మన అవసరాలను అర్థం చేసుకుంటుంది, మన అలవాట్లనుంచి నేర్చుకుంటుంది. ఈ లక్షణాలే ఏఐని ఒక సాధనంగా కాకుండా మనకు సహాయపడే మిత్రుడిగా మార్చుతున్నాయి. మన దైనందిన జీవితంలో ఏఐ : ఈరోజు మనం ఉపయోగిస్తున్న మొబైల్ ఫోన్, సోషల్ మీడియా, ఆన్లైన్ షాపింగ్, నావిగేషన్, బ్యాంకింగ్ —— అన్నిటిలోనూ ఏఐ ఉంది. మనకు నచ్చిన పాటలు సూచించడం, సమయాన్ని ఆదా చేసే మార్గాలు చూపించడం, వెంటనే సందేహాలకు సమాధానాలు ఇవ్వడం—— ఇవన్నీ ఏఐ మనతో పాటు నడుస్తున్న ఉదాహరణలు. విద్యలో ఏఐ - ఒక మార్గదర్శి : విద్యారంగంలో ఏఐ ఒక గొప్ప మార్పు తీసుకొస్తోంది. విద్యార్థులకు వ్యక్తిగతంగా నేర్చుకునే అవకాశాలు, సందేహాలను ఎలాంటి సంకోచం లేకుండా అడిగే స్వేచ్ఛను ఇస్తోంది. ఉపాధ్యాయులు, పరిశోధకులకు సమాచారం సేకరణ, విశ్లేషణ, రచనలో సహాయపడుతోంది. అందువల్ల ఏఐను ఒక శిక్షణ మిత్రుడిగా చూడవచ్చు. భావోద్వేగ సహాయంలో ఏఐ : మనుషుల అనుభూతులను పూర్తిగా భర్తీ చేయలేకపోయినా, ఏఐ కొంతమందికి తమ భావాలను వెలిబుచ్చేందుకు ఒక భద్రమైన వేదికగా మారుతోంది. ఎవరినీ విమర్శించకుండా, ఓపికగా వినడం —— ఇది మంచి స్నేహితుడి లక్షణం. ఈ కోణంలో కూడా ఏఐ మనకు తోడుగా నిలుస్తోంది. నైతిక బాధ్యత : ఏఐని మిత్రుడిగా భావిస్తే, దానిని సరైన మార్గంలో అభివృద్ధి చేయాల్సిన బాధ్యత మనదే. పాక్షికత లేకుండా, మానవ విలువలకు అనుగుణంగా ఏఐను రూపొందించినప్పుడే అది నిజమైన మిత్రంగా నిలుస్తుంది. భవిష్యత్తు మనుషులు వర్సెస్ ఏఐ కాదు. అది మనుషులు + ఏఐ. మన ఆలోచనలకు బలం చేకూర్చి, మన సామర్థ్యాలను పెంచుతూ, జీవితాన్ని సులభతరం చేయడమే ఏఐ లక్ష్యం. చివరిగా ఏఐ మన స్థానాన్ని తీసుకోవడానికి రాలేదు. మనతో కలిసి నడవడానికి, మన ప్రయాణాన్ని సులభం చేయడానికి వచ్చింది.



# ప్రాణం ఉన్నంతవరకు ప్రజాసేవ చేస్తా

**నల్గొండ, విశాలభారతి:**

140 సంవత్సరాలుగా పేదవాడి కష్టాలు తీర్చడం కోసం పోరాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించి, తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం వలిగొండ నుంచి కాటేపల్లి వరకు రూ.49.50 కోట్లతో నిర్మించిన రహదారి ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముందుగా మండలంలోని సుంకిశాల గ్రామంలో ఎన్నారై పైళ్ల మల్లారెడ్డి నిర్మించిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో పైళ్ల మల్లారెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం వలిగొండలో స్థానిక శాసనసభ్యులు కుంబం అనిల్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఆలేరు శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం, ఎన్నారై పైళ్ల మల్లారెడ్డి తదితరులతో కలిసి రహదారిని ప్రారంభించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ 140వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద పూలమాలలు వేసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనూ రాష్ట్రంలోనూ అనేక పార్టీలు పుట్టగొడుగుల్లా వస్తూ పోతుంటాయని, కానీ 140 సంవత్సరాలుగా దేశం కోసం, ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తూ 50 సంవత్సరాలు దేశాన్ని పాలించిన ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. 2005లో ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ నాయకత్వంలో మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చి ప్రతి కుటుంబానికి 100 రోజుల పని కల్పించామని చెప్పారు. ప్రస్తుతం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆ పథకాన్ని బలహీనపరిచి కార్పొరేట్ సంస్థలను బలోపేతం చేయాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అందుకే కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ నేతృత్వంలో దేశవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహించి, కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించేలా చేస్తామని తెలిపారు. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ ఆశయాల సాధన కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పని చేస్తుందని పేర్కొన్నారు. తదుపరి ర్యాలీగా బయలుదేరి స్థానిక శ్రీ వెంకటేశ్వర జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన నూతన సర్పంచులు, ఉపసర్పంచుల సన్మాన కార్యక్రమంలో పాల్గొని వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్పంచులు, ఉపసర్పంచులు పార్టీలకతీతంగా గ్రామ ప్రజల గుండెల్లో నిలిచిపోయేలా సేవలందించాలని సూచించారు. ఈ రహదారి మాదిరిగానే భువనగిరి, చిట్యాల రోడ్డును రూ.150 కోట్లతో నాలుగు లైన్ల రహదారిగా విస్తరించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. ఎమ్మెల్యే కుంబం అనిల్ కుమార్ రెడ్డి కోరిక మేరకు వలిగొండ, వెల్వర్తి, మొగిలిపాక మీదుగా మోత్కూర్ వరకు రూ.50 కోట్లతో డబుల్ రోడ్డును నిర్మించనున్నట్లు ప్రకటించారు. రోడ్ల నిర్మాణంతో గ్రామీణ ప్రాంతాలకు రవాణా సౌకర్యం మెరుగుపడి, భూములకు విలువ పెరుగుతుందని, తద్వారా గ్రామీణ ప్రజలు ఆర్థికంగా బలపడతారని అన్నారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నూతనంగా గెలిచిన సర్పంచులు, ఉపసర్పంచులు ప్రభుత్వంతో పాటు ప్రజాపాలనలో భాగస్వాములయ్యారని చెప్పారు. ప్రజాసేవలో చురుగ్గా పాల్గొని మండలానికి మేలు చేయాలని సూచించారు. సర్పంచ్ స్థాయి నుంచి ముఖ్యమంత్రిగా ఎదిగిన నేతలు ఎందరో ఉన్నారని హితబోధ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని గ్రామంలోని ప్రతి ఒక్కరికీ వివరించాలని కోరారు. భువనగిరి ఎమ్మెల్యే కుంబం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భువనగిరిలో 40 సంవత్సరాల రాజకీయ చరిత్రను కేవలం రెండు సంవత్సరాల్లోనే కాంగ్రెస్ పార్టీ మార్చిందని అన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీకి ఓటు బ్యాంకు తక్కువగా ఉండేదని, కానీ రెండేళ్లలో అది గణనీయంగా పెరిగిందన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో 90 శాతం సీట్లు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులే రెబల్స్‌గా పోటీ చేయడం వల్ల తక్కువ స్థానాలు గెలిచామని, కానీ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీ గుర్తులు ఉంటాయని, అందువల్ల అధిక సీట్లు సాధిస్తామని తెలిపారు. సంగం భీమలింగేశ్వర స్వామి వద్ద మూసీ నదిపై రూ.50 కోట్లతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నిధులతో హైలెవల్ వంతెన నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. గ్రామాల అభివృద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా చిన్న గ్రామాలకు రూ.5 లక్షలు, పెద్ద గ్రామాలకు రూ.10 లక్షలు నిధులు కేటాయించి అభివృద్ధికి దారి వేశారని అన్నారు. భువనగిరి నియోజకవర్గాన్ని మంత్రుల సహకారంతో అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీపీ అక్షాంశ్ యాదవ్, అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, ఆర్డీవో శేఖర్ రెడ్డి, తహసీల్దార్ దశరథ్, మండల పార్టీ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు కంకల కిష్టయ్య, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, కాంగ్రెస్ కార్యకర్తలు, వలిగొండ, భువనగిరి మండలాల్లో నూతనంగా గెలుపొందిన సర్పంచులు, ఉపసర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం

**బీజేపీ మున్సిపల్ అధ్యక్షులు మాధాపురం శ్రీకాంత్**

**మొయినాబాద్, విశాలభారతి:**

మొయినాబాద్ బీజేపీ మున్సిపల్ అధ్యక్షులు మాధాపురం శ్రీకాంత్ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కే.ఎస్. రత్నం, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంజర్ల ప్రకాష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కే.ఎస్. రత్నం మాట్లాడుతూ, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ కచ్చితంగా విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మొయినాబాద్ మున్సిపాలిటీలో పార్టీ కీలక బాధ్యతలు చేపట్టి ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గున్నాల గోపాల్ రెడ్డి, పడమటి మోహన్ రెడ్డి, అత్తపురం శ్రీనివాస్ గౌడ్, మొర నర్సింహారెడ్డి, శ్రీరములు ముదిరాజ్, రాజు యాదవ్, దర్గా మహేందర్, తూర్పు మాధవ రెడ్డి, దప్పు ఆనంద్, సుధీంద్ర శర్మ, లక్ష్మిపత్తి యాదవ్‌తో పాటు రాష్ట్ర, జిల్లా, మండల, బూత్ స్థాయి నాయకులు మరియు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అంబేద్కర్ స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుంది

- బోడుప్పల్లో 358వ వారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు జ్ఞానమాల
- అంబేద్కర్ కు నివాళులర్పించిన మంత్రి వివేక వెంకట్ స్వామి, వజ్రేష్ యాదవ్
- నత్తి మైసయ్యను అభినందించిన మంత్రి వివేక్



**మేడిపల్లి, విశాలభారతి :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 358వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ రాపోలు రాములు, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కృషి, త్యాగం ఫలితంగానే భారతీయులందరికీ స్వేచ్ఛ, సమానత్వాలు లభించాయని ప్రతి ఒక్కరూ నిత్యం అంబేద్కర్ ఆశయాల కోసం ఆకాంక్షల కోసం కృషి చేయాలని పిలుపునిస్తూ 358 ఆదివారాలుగా ప్రతి ఆదివారం అంబేద్కర్ కు జ్ఞానమాల సమర్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న కత్తి మైసయ్యను అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులను మంత్రి వివేక్ ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల కోసం యువత కోసం, అన్ని వర్గాల అభివృద్ధి ప్రధాన అజెండాగా కాంగ్రెస్ సర్కార్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, సర్పంచ్ ఎన్నికల ఫలితాలే కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క పనితీరుకు నిదర్శనమని, సర్పంచి పలితాలు కాంగ్రెస్ చేనుల్లో కొత్త ఉత్సాహాన్ని ఇచ్చాయని ఆయన అన్నారు. అనంతరం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని నత్తి మైసయ్య మంత్రికి బహుమతిగా అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు రాపోలు శ్రీరాములు, గరుగులయ్య యాకయ్య, బండారి సాయి, చిల్ల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## సుభద్ర నగర్ కాలనీ అభివృద్ధికి కార్పొరేటర్ కృషి

- కాలనీవాసుల కృతజ్ఞతలు



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** హయత్ నగర్ లోని సుభద్ర నగర్ కాలనీ అభివృద్ధికి నిరంతరం సహకరిస్తూ, రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతుల సమస్యలను పరిష్కరిస్తున్న హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అన్ని కాలనీల అభివృద్ధికి నిత్యం అందుబాటులో ఉంటూ పనిచేస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సుభద్ర నగర్ కాలనీ ప్రెసిడెంట్ లక్ష్మణ స్వామి, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, కోశాధికారి కొడయ్యతో పాటు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డ్రీమ్ డిఫెన్స్ అకాడమీ గ్రౌండ్ ప్రారంభం

- హయత్ నగర్ ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్




**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** హయత్ నగర్ పరిధిలోని లక్ష్మా రెడ్డి పాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన డ్రీమ్ డిఫెన్స్ అకాడమీ గ్రౌండ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హయత్ నగర్ పోలీస్ ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అకాడమీ నిర్వాహకులు మాట్లాడుతూ.. పోలీస్, ఆర్మీ వంటి రక్షణ శాఖల ఉద్యోగాలకు సిద్ధమవుతున్న యువతకు ఎటువంటి ఫీజు చెల్లించే అవసరం లేకుండా పూర్తిగా ఉచితంగా శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. యువతలోని ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని, పూర్తిగా సేవాభావంతోనే ఈ అకాడమీని ఏర్పాటు చేశామని అన్నారు. అనుభవజ్ఞులైన కోచ్ సాయి మిల్కా ఆధ్వర్యంలో రన్నింగ్ ఈవెంట్స్, ఎండ్యూరెన్స్ ట్రైనింగ్, అబ్స్టాకిల్ కోర్సులు, ఫిట్నెస్, మోటివేషన్ వంటి అంశాల్లో సమగ్ర శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అకాడమీ ద్వారా రాష్ట్రం, దేశానికి సేవ చేసే శక్తివంతమైన యువతను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వివరించారు.ఈ సందర్భంగా హయత్ నగర్ ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్ అకాడమీ నిర్వాహకులను అభినందిస్తూ, ఇలాంటి ఉచిత శిక్షణా కేంద్రాలు యువతకు గొప్ప అవకాశంగా మారతాయని అన్నారు. క్రమశిక్షణ, శారీరక దృఢత్వంతో యువతను సరైన దారిలో నడిపించే కార్యక్రమాలకు పోలీస్ శాఖ నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా స్థానిక యువతకు రక్షణ రంగాలలో ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అకాడమీ నిర్వాహకులు మూడవత్ సాయి, మాజీ కోఫ్షన్ మెంబర్ బాబు,కైలాష్, సాయి, రాహుల్, సిద్ధు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడల్లో దృష్టి సారించి రాణించాలి

- బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి




**విశాలభారతి, మర్పల్లి:** యువత క్రీడలపై దృష్టి సారించి ఉత్తమ ప్రతిభ కనబరిస్తే స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించవచ్చని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు, రావులపల్లి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి సూచించారు. గత రెండు రోజులుగా పట్లూరు గ్రామంలో నిర్వహిస్తున్న ప్రీమియం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తుండగా ఆదివారం ఫైనల్ టోర్నమెంట్లోఫైనల్ మ్యాచ్లో పెరోజ్ టీమ్, సురేష్ టీం తలపడగా, విజేతగా ఫెరోజ్ టీమ్ నిలవగా సురేష్ టీం రెండవ బహుమతి పొందారు.బెస్ట్ బౌలర్ గా మున్నాభాయ్, బెస్ట్ బ్యాట్స్మెన్ గా ఎర్రగట్టు, నిలిచారు . గెలుపొందిన జట్టులకు బహుమతులు ప్రధానోత్సవానికి ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు, రావులపల్లి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ట్రోఫీని, అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ యువకులు క్రీడల పట్ల మక్కువ పెంచుకొని క్రమశిక్షణ పట్టుదల తో ఆటలను ఆడితే మానసిక ఉల్లాసము, శరీర దారుఢ్యము, క్రీడల పట్ల మెరుగుపడే అవకాశం ఉందన్నారు. చదువుకున్న విద్యార్థులు క్రీడల పట్ల దృష్టి పెట్టి పోటీ పరీక్షలకు సిద్ధమవుతే స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించవచ్చు అని సూచించారు. ఇంత పెద్ద ఎత్తున ఈ ఫ్రెండ్లీ క్రికెట్ లీగ్ ఏర్పాటు చేసి విజయవంతంగా పూర్తి చేసినందుకు ఆర్గనైజర్ లు తలారి రమేష్, తుమ్మల మల్లేష్ , ప్రత్యేక అభినందనలు తెలిపారు . టోర్నమెంట్లో పాల్గొన్న ప్రతి ఒక్క క్రీడాకారునికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్లూర్ మాజీ సర్పంచ్, ఇందిరా అశోక్ , కాంటెస్ట్ సర్పంచు సునీల్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు షఫీ,మాజీ ఎంపిటిసి అంజయ్య , నూతనంగా ఎన్నికైన వార్డ్ మెంబర్లు జాను, రాకేష్ సీనియర్ నాయకులు బాలేష్ గఫార్, గబ్బర్ నర్సింగ్, గిటార్లపల్లి దశరథ్, హాజీ తదితరులు పాల్గొన్నారు.

## సురక్షితమైన రోడ్ల కోసం 2 కే వాక్

- భారీగా జరిగిన నగర ప్రజలు
- జలవిహార్ నుండి పీపుల్స్ ప్లాజా వరకు కొనసాగిన వాక్




**ముషీరాబాద్, విశాలభారతి:** గుంతలు లేని హైదరాబాద్ నగర రోడ్ల కోసం సురక్షిత రోడ్ల కోసం... తెలంగాణ ఆమ్ ఆద్మీ పార్టీ నెక్లెస్ రోడ్ లో ఆదివారం రన్ నిర్వహించింది. 2కె రన్ పేరుతో జలవిహార్ నుంచి పీపుల్స్ ప్లాజా లోని లవ్ హైదరాబాద్ వరకు సాగిన ఈ నడకలో పార్టీ సీనియర్ నాయకులు, వాలంటీర్లు, ఎన్జీఓలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సురక్షిత రోడ్లు మా హక్కు అంటూ గట్టిగా డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు బుర్ర రాము గౌడ్, ఎస్.కె అన్సారి, జిల్లోజు హేమా మాట్లాడుతూ వేల కోట్ల బడ్జెట్ ఉన్నప్పటికీ హైదరాబాద్ నగరం గుంతల మయంగా మారి ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీ నాయకులు, అధికారులు పట్టించుకోక పోవడం దారుణమని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య పాలన వల్ల హైదరాబాద్ రోడ్లు మృత్యువు అంచుగా మారాయని మండిపడ్డారు. రోడ్ల అభివృద్ధి పేరుతో వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినా నగరమంతా గుంతల సమాధిగా మారిందని విమర్శించారు. ప్రజలు రోడ్లపై వెళ్లడం అంటే ప్రాణాలతో ఆటఆడటమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది పరిపాలనా వైఫల్యం కాదని... ప్రజల ప్రాణాలను లెక్కచేయని నేరపూరిత నిర్లక్ష్యమని ఆరోపించారు. ఈ ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ప్రజల గళాన్ని ఒక్కటిగా వినిపించేందుకు 2కే వాక్ పేరిట ప్రభుత్వాన్ని మేలు కొల్పేందుకే కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు అబ్దుల్, అబ్బాస్, విజయ్, మజీద్, సుధారాణి, వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

## 24 ఏండ్ల తరువాత కలసిన స్నేహితులు



**రాజేంద్రనగర్ విశాలభారతి:** మైలార్ దేవ్ పల్లి లోని 2000 2001 లో పదోతరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానికంగా నిర్వహించారు. దాదాపు 24 ఏళ్ల తర్వాత తోటి స్నేహితులందరూ ఒకే వేదిక పైకి చేరుకోవడంతో ఆ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా స్నేహితులు కలుసుకొని ఆ నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు అలాగే ఎవరెవరు ఏమేమి చేస్తున్నారో అని ఒకరికొకరు తమ సాధక బాధలు తెలుసుకొని ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాటి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వచ్చారు. గురువులకు పాదాభివందనం చేసి, శాలువాలతో సన్మానించారు.

## ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :** అబ్దుల్లాపూర్మెట్ మండలం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని కవాడిపల్లి గ్రామంలో జాతీయ కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవాడిపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జెండాను గ్రామ సర్పంచ్ కొలను ప్రసన్నలక్ష్మి రవీందర్ రెడ్డి, ఉప సర్పంచ్ రసాల రమేష్ కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కొలను ప్రసన్నలక్ష్మి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ..దేశ స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించిన చారిత్రక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ, జవహర్లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, డా. బీఆర్ అంబేద్కర్ వంటి మహానుభావుల ఆశయాలు, ఆలోచనలతో ముందుకు సాగిన పార్టీ కాంగ్రెస్ అని గుర్తు చేశారు.ప్రజాస్వామ్యం, లౌకికత్వం, సామాజిక న్యాయం, సమానత్వం కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతాలని తెలిపారు. పేదలు, రైతులు, కార్మికులు, మహిళలు, యువత సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. నేటి పరిస్థితుల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ప్రత్యామ్నాయ శక్తిగా నిలుస్తోందని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లో మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ యం పి పి కొలను శ్రీధర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ఎల్బీనగర్, విశాలభారతి:** 141వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎల్.బి నగర్ రింగ్గు రోడ్డు చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించిన టీపీసీసీ ప్రతినిధి శ్రీ జక్కిడి ప్రభాకర్ రెడ్డి, ముద్దగోని రామ్మోహన్ గౌడ్,ఈ సందర్భంగా జక్కిడి ప్రభాకర్ రెడ్డి, ముద్దగోని రామ్మోహన్ గౌడ్ లు మాట్లాడుతూ. స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించిన చారిత్రక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు.మహాత్మా గాంధీ,జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్,అంబేద్కర్ వంటి మహానుభావుల ఆలోచనలతో ముందుకు సాగిన పార్టీ కాంగ్రెస్ అని గుర్తు చేశారు.ప్రజాస్వామ్యం,లౌకికత్వం,సామాజిక న్యాయం, సమానత్వం కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతాలని తెలియజేసారు.పేదలు,రైతులు,కార్మికులు, మహిళలు,యువత సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యం అన్నారు.నేటి పరిస్థిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ప్రత్యామ్నాయ శక్తిగా నిలుస్తుందని, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.స్వాతంత్ర్య ఉద్యమాన్ని, రాజ్యాంగాన్ని మోడీ సర్కార్ తుంగ్గలో తొక్కాలని చూస్తుందని మండిపడ్డారు.త్వరలోనే కేంద్ర ప్రభుత్వానికి మోడీ నిరంకుశ పాలనకు ప్రజలు తగిన బుద్ధి చెప్తారు అని అన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, SC, ST, BC, మైనారిటీ నాయకులు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బుచన్నపల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా జన్ముల మహేందర్



**విశాలభారతి, మర్పల్లి:** మండలంలోని బుచన్నపల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన జన్ముల మహేందర్ ను ఆదివారం కాంగ్రెస్ నాయకుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీని గ్రామంలో బలోపేతం చేస్తానని ధీమ వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకట్రాంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్, ఉప సర్పంచ్ శకుల్, మాజీ ఎంపీటీసీ బాలరెడ్డి ,సుదర్శన్, నరసింహా రెడ్డి, రఘుపతి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రవి, రాజు, గోపాల్, బాబు, భాగయ్య, ఉపాధ్యక్షుడు రాములు, కోశాధికారి కిష్టయ్య, ఉప అధ్యక్షుడు రాములు ప్రధాన కార్యదర్శి రామచందర్ సంయుక్త కార్యదర్శి కిష్టయ్య కోశాధికారి బైండ్ల రంగయ్య,కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్యం ప్రభుత్వానికి పట్టదా?



- జనావాసాల్లో డంపింగ్ యార్డు శాపంగా మారింది
- ఆమనగల్ జనంబాటలో జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**రంగారెడ్డి, విశాలభారతి:** ప్రజల ఆరోగ్యం ఈ ప్రజా ప్రభుత్వానికి పట్టడం లేదా?జనవాసాల్లో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు వల్ల ఆమనగల్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని జిల్లాలలో చేపట్టిన జనం బాట ఆదివారం రంగారెడ్డి జిల్లా ఆమనగల్ కు చేరుకుంది. శనివారం రాత్రి కడ్తాల్ మండలం సాలర్ పూర్ లో బస చేసిన కవిత ఆదివారం పర్యటనలో భాగంగా ముందుగా మైసిగండి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉదయం జాగృతి నాయకులతో కలిసి ఆమనగల్ మున్సిపల్ కేంద్రంలో పర్యటించారు.కవితకు గుర్రంగుట్ట కాలనీ మహిళలు హారతితో స్వాగతం పలికారు. మార్కెట్ యార్డు నుండి డంపింగ్ యార్డు వరకు మహిళలతో కలిసి నడుచుకుంటూ వెళ్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.6వ వార్డు గుర్రగుట్టం,కమల్ నగర్ ప్రాంతంలో ప్రజల ఇండ్ల మధ్య ఉన్న డంపింగ్ యార్డ్ ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ మీడియాతో మాట్లాడారు. జనావాసాల్లో డంపింగ్ యార్డు పెట్టారు.. ఇది సరైన పద్ధతి కాదు.. దీన్ని తీసేయాలని ఆరేళ్లుగా ప్రజలు ధర్నాలు చేస్తూ దరఖాస్తులు ఇస్తున్నారు. డంపింగ్ యార్డ్ కారణంగా ప్రజలు ఆరోగ్య పరంగా తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఇటీవలే ఒక బాలింత కూడా చనిపోయిందని చెబుతున్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఈ డంపింగ్ యార్డ్ సమస్యపై శ్రద్ధ పెట్టాలన్నారు. అధికారులకు అప్లికేషన్ ఇచ్చినప్పటికీ వాళ్లు కనీసం పట్టించుకోవటం లేదని ఇక్కడికి 8 కిలోమీటర్ల దూరంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు కోసం రూ.కోటి 20 లక్షలు కూడా మంజూరు చేశారు. మున్సిపల్ కమిషనర్ ను పిలిపించుకొని ఈ ప్రాంతాన్ని ఎమ్మెల్యే పరిశీలించాలన్నారు. చెత్తశాఖ మంత్రి మీ ముఖ్యమంత్రే కనుక ఆయనను డిమాండ్ లేక కమాండ్ చేసి ఈ సమస్య పరిష్కరించాలని కవిత డిమాండ్ చేశారు.మా యాత్ర ఫిబ్రవరిలో పూర్తి అవుతుందని అప్పటివరకు ప్రభుత్వానికి సమయం ఇస్తున్నామని ఆ తర్వాత మేమే ఈ డంపింగ్ యార్డ్ ను క్లీన్ చేస్తామన్నారు. ఇక్కడ ప్లాస్టిక్ గుట్టలుగా పేరుకుపోయిందని,పర్యావరణం మీద పట్టి లేకుండా రోజు చెత్తను కాల్చుతున్నారని దీంతో విషవాయువులు ప్రబలి ప్రజలకు క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఇక్కడి ఎమ్మెల్యే చదవుకున్న వారు, విజ్ఞులు. వీలైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తారని భావిస్తున్నామని లేదంటే హైకోర్టుకు వెళ్లైనా సరే ఈ డంపింగ్ యార్డ్ను తొలగిస్తామని కవిత కీలక ప్రకటన చేశారు.

## ఫైసల్ కొట్టు.. అక్రమ నిర్మాణం కట్టుకో

- సర్కిల్-03 ఏసీపీ కార్యాలయంలో అవినీతి కంపు
- ఉద్యోగం కన్నా ముడుపులు ముద్దు అన్నట్లుగా ఏసీపీ సెక్షన్ ఆఫీసర్
- గాఢ నిద్రలో ఏసీబీ అధికారులు



**ఎల్బీనగర్, విశాలభారతి :** ఈ బిల్డింగులకు ఉన్న అనుమతులు ఏమిటో చెప్పండి హయత్నగర్ సర్కిల్ 03 కమిషనర్ జీ?! స్టిల్ ప్లస్ టు పర్మిషన్ తీసుకొని నాలుగు అంతస్తుల భవనాలు నిర్మించవచ్చా? వీటికి కూడా నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటారా?... ఈ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటారా?? విజయవాడ జాతీయ రహదారి ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ పక్కన వెలసిన అక్రమ నిర్మాణాలు ఇదిగో... ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పరిధిలో హయత్ నగర్ సర్కిల్ ఎసిపి టౌన్ ప్లానింగ్ అధికారి విజయలక్ష్మి పర్యవేక్షణలో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ పక్కన ఉన్న బిల్డింగు ఏ మేరకు అనుమతులు తీసుకొని నిర్మిస్తున్నారో హెచ్ఎంసి సర్కిల్ 3 డిప్యూటీ కమిషనర్ సమాధానం చెప్పాలని స్థానిక ప్రజా సంఘాల నేతలు దిమాండ్ చేస్తున్నారు. ఈ బిల్డింగులకు ఎటువంటి అనుమతులు ఉన్నాయో చెప్పాలని కోరిన వారు, సర్కిల్ ఆఫీస్ నుండి నుంచి జి ప్లస్ టు అనుమతులను తీసుకొని గ్రౌండ్ ఫ్లోర్ తో సహా నాలుగు అంతస్తుల భవనాలను నిర్మించవచ్చా అంటూ నేరుగా కమిషనర్ ను ప్రశ్నించారు.

**అవినీతి కంపులో ఏసిపి కార్యాలయం**

కాలనీ అసోసియేషన్ సభ్యుల ఆరోపణలు. సర్కిల్ ఏసీపీకి జోనల్ ఆఫీస్ సిపి మరియు హయత్ నగర్ డిప్యూటీ కమిషనర్ సీజింగ్ ఆర్డర్ ఇచ్చి వెంటనే సీజ్ చేయాలని ఆదేశించిన ఏషిపి మాత్రం నిమ్మకు నీరు ఎత్తినట్టుగా అమావాస్యలు, పున్నాలు గుర్తొచ్చి నోటీసులు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారన్నారంటే లంచాలు కూడా అదే భారీ ఎత్తున తీసుకున్నట్టున్నారో అని స్థానికుల కాలనీ అసోసియేషన్ సభ్యుల నుండి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

## జాఫర్గూడ సర్పంచ్, ఉపసర్పంచ్లకు ఘన సన్మానం



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ఇటీవల జరిగిన మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించిన జాఫర్గూడ గ్రామ సర్పంచ్ ఎర్ర వెంకటేష్ యాదవ్, ఉపసర్పంచ్ బద్దం జంగారెడ్డిలను పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ గంట లక్ష్మారెడ్డి మర్యాదపూర్వకంగా కలుసుకుని శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా గంట లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. గ్రామ ప్రజల నమ్మకాన్ని గెలుచుకుని ఘన విజయం సాధించిన సర్పంచ్, ఉపసర్పంచ్లు గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రజా సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధి దిశగా ముందుకు సాగితే జాఫర్గూడ గ్రామం ఆదర్శ గ్రామంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో అందరి సహకారం తీసుకుంటూ పారదర్శక పాలన అందిస్తామని సర్పంచ్ ఎర్ర వెంకటేష్ యాదవ్, ఉపసర్పంచ్ బద్దం జంగారెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ‘పొరపాటు’ పేరుతో తప్పు కప్పిపుచ్చే ప్రయత్నమా?

- పెనుబల్లి ఎమ్మార్వోపై ప్రజల్లో అనుమానాలు
- పెనుబల్లి రెవెన్యూ ఉద్యోగుల నిర్వాహకం
- రూ.లక్షలు చేతులు మారినట్లు ప్రచారం
- తప్పును సరిదిద్దుకునేందుకు తహసీల్దార్ ప్రయత్నం
- తహసీల్దార్‌పై సబ్‌కలెక్టర్, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు



**సత్తుపల్లి, విశాలభారతి:**

ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన రెవెన్యూ ఉద్యోగులే కంచె చేను మేసిన చందంగా మారారని పెనుబల్లి తహసీల్దార్ నిర్వాహకంపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసే ప్రయత్నంలో భాగంగా 3.20 ఎకరాల కుంటల భూమిలో నుంచి 1.20 ఎకరాల భూమికి డిజిటల్ సైన్ పూర్తి చేసి పట్టాదారు పాస్‌బుక్ కోసం ఎదురుచూస్తున్న సమయంలో భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే, పెనుబల్లి మండలం చింతగూడెం గ్రామ రెవెన్యూ పరిధిలో శీలం లీలావతి అనే మహిళకు సంబంధించిన సర్వే నంబర్లు 71/3, 71/4లలో ఉన్న 3.20 ఎకరాల భూమిని ప్రభుత్వ భూమిగా గుర్తించి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. 2022 ఆగస్టు నెలలో అప్పటి జిల్లా కలెక్టర్ సరిహద్దులు నిర్ధారించి ప్రభుత్వ భూమి సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు.

అయితే చింతగూడెం రెవెన్యూ పరిధిలో గ్రీన్‌ఫీల్డ్ హైవే, ఖమ్మం-దేవరపల్లి, విజయవాడ-భద్రాచలం జాతీయ రహదారికి ఆనుకుని ఉండటంతో సుమారు రూ.5.5 కోట్ల విలువ చేసే ఈ భూమిపై అక్రమార్కులు కన్నేశారు. ఈ క్రమంలో ఇటీవల భూభారతి పోర్టల్‌లో నమోదు కోసం దరఖాస్తు చేయగా, మొత్తం 3.20 ఎకరాల్లో నుంచి 1.20 ఎకరాల భూమిని శీలం లీలావతి భర్త రామచందర్‌రెడ్డి పేరుపై తహసీల్దార్ డిజిటల్ సైన్ పూర్తి చేసి హైదరాబాద్ సర్వర్‌కు పంపినట్లు ఆరోపణలు ఉన్నాయి.

దీనిపై అనుమానం వ్యక్తం చేసిన చింతగూడెం గ్రామస్తులు రికార్డులను పరిశీలించగా, పెనుబల్లి తహసీల్దార్‌తో పాటు రెవెన్యూ ఉద్యోగుల నిర్వాకం బట్టబయలైనట్లు తెలుస్తోంది. చింతగూడెం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 71/3, 71/4లలోని 3.20 ఎకరాల సీలింగ్ భూమిని రిజిస్ట్రేషన్ మార్చి శీలం లీలావతి పేరున నమోదు చేయడానికి పెనుబల్లి తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్‌తో పాటు రెవెన్యూ ఉద్యోగులకు భారీగా ముడుపులు ముట్టినట్లు మండలంలో పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది. ముందస్తు ఒప్పందం మేరకు కొంత నగదు రెవెన్యూ ఉద్యోగులకు అందించి, పట్టాదారు పాస్‌బుక్ వచ్చిన వెంటనే మిగిలిన నగదు చెల్లించేలా ఒప్పందం కుదిరినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సాధారణంగా గ్రామ రెవెన్యూ అధికారి (వీఏఓ) విచారణ అనంతరం ఆర్‌ఐ పంచనామా, సూపరింటెండెంట్, డిప్యూటీ తహసీల్దార్ ద్వారా చివరకు తహసీల్దార్ డిజిటల్ సంతకం ఉండాలి. అయితే ఈ ప్రక్రియలేవీ లేకుండా నేరుగా తహసీల్దార్ డిజిటల్ సైన్ చేసినట్లు ఉద్యోగులే ఆరోపిస్తున్నారు. పెనుబల్లి మండలంలో ప్రభుత్వ భూమి వ్యవహారంపై తహసీల్దార్ ఇచ్చిన వివరణపై ప్రజల్లో అనుమానాలు మరింత పెరుగుతున్నాయి. “ఉన్నతాధికారుల ఒత్తిడితో పొరపాటున 1.20 ఎకరాల భూమికి డిజిటల్ సైన్ పూర్తైంది” అని మీడియా ముందుకు వచ్చి వివరణ ఇవ్వడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఒక ప్రభుత్వ భూమికి సంబంధించిన డిజిటల్ సంతకం అంత తేలికగా “పొరపాటున” ఎలా పూర్తవుతుందన్న సందేహాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. వీఏఓ విచారణ, ఆర్‌ఐ పంచనామా, సూపరింటెండెంట్, డిప్యూటీ తహసీల్దార్ వంటి కీలక దశలన్నింటిని దాటకుండా నేరుగా డిజిటల్ సైన్ జరిగిందంటే, అది సాధారణ పొరపాటా?

**లేక వ్యవస్థపరమైన నిర్వాకమా? అన్న చర్చ జరుగుతోంది.**

ఈ వ్యవహారం బయటకు వచ్చిన తర్వాతే మీడియా ముందుకు వచ్చి “తప్పు జరిగింది... సరిదిద్దుతున్నాం” అని చెప్పడంపై కూడా ప్రజలు తీవ్ర అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మొదటి నుంచి రికార్డులు సక్రమంగా ఉంటే, గ్రామస్తులు ప్రశ్నించే పరిస్థితి ఎందుకు వచ్చిందని వారు నిలదీస్తున్నారు. కొంతమంది అభిప్రాయం ప్రకారం, ఎమ్మార్వో చేసిన తప్పును కప్పిపుచ్చుకోవడానికే ఈ ‘పొరపాటు’ వాదనను ముందుకు తెచ్చారని, వ్యవహారం బయటపడిన తర్వాతే మాట మార్చారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతా తెలిసిన తర్వాత “పొరపాటు జరిగింది” అని చెప్పడం ద్వారా బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నమన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ భూముల పరిరక్షణ బాధ్యత వహించాల్సిన అధికారులే వివాదాల కేంద్రంగా మారడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ వ్యవహారంలో నిజంగా ఒత్తిడి ఉందా? లేక అక్రమాన్ని కప్పిపుచ్చేందుకు ఒత్తిడి పేరుతో వివరణ ఇస్తున్నారా? అన్న ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రావాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్వతంత్రంగా విచారణ చేపట్టి, తప్పు ఎవరిదైనా సరే కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే “పొరపాటు” అనే పదం ప్రభుత్వ భూముల దోపిడీకి రక్షణ కవచంగా మారుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఘటనపై పెనుబల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పంది వెంకటేశ్వర్లు, పలువురు కాంగ్రెస్ నాయకులు, చింతగూడెం గ్రామస్తులు కలిసి కల్లూరు సబ్‌కలెక్టర్ అజయ్ కుమార్ యాదవ్‌కు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దరిశెట్టికి ఫిర్యాదు చేశారు. తహసీల్దార్‌తో పాటు సంబంధిత రెవెన్యూ ఉద్యోగులపై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకుని, విధుల నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేశారు.

## యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన



**పాల్వంచ, విశాల భారతి:** కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ, ఉపాధి హామీ పథకం నుంచి మహాత్మా గాంధీ గారి పేరును తొలగించడం దేశ చరిత్రకు, గ్రామీణ పేదల ఆత్మగౌరవానికి చేసిన ఘోర అవమానమని పాల్వంచ పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పైడిపల్లి దుర్గామహేష్ అన్నారు. గాంధీజీ ఆశయాలతోనే ఉపాధి హామీ పథకం రూపుదిద్దుకుందని, గ్రామీణ పేదలకు పని మరియు గౌరవం కల్పించిన ఈ పథకాన్ని రాజకీయ దురుద్దేశంతో వక్రీకరించడం అత్యంత దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు ఈ అన్యాయ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి గాంధీజీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు ఉండేటి శాంతివర్ధన్, మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బండి నాగరాజు, గంధం నర్సింహారావు, డిష్ నాగేశ్వర రావు, షేక్ షఫీ, యువజన కాంగ్రెస్ నాయకులు మొగిలి కిశోర్, పట్టా ఎఫ్ట, ఉదయ్ కుమార్, సంతోష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయి

- రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్,డి.సి.ఎం.స్. మాజీ చైర్మన్ కొత్వాల



**పాల్వంచ, విశాలభారతి:** క్రీడా నిర్వహణతో యువతలో నాయకత్వ లక్షణాలు, మానవ సంబంధాలు పెంపొందుతాయని రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, డి.సి.ఎం.స్.మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ కె టి పి స్ 5, 6 దశల బాస్కెట్ బాల్ గ్రౌండ్ లో దివంగతులు జే.సి.ప్రణీత్, వడ్లమూడి హర్షవర్ధన్ ల జ్ఞాపకార్థం ఆదివారం 13వ బాస్కెట్ బాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీలకు కొత్వాల ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రారంభించారు. కొత్వాల మాట్లాడుతూ దివంగత మిత్రులను చిరకాలం గుర్తుంచుకొని, వారి పేరిట క్రీడలు నిర్వహిస్తున్న మిత్రులు అభినందనీయులన్నారు. క్రీడలు మానసికోల్లాసానికి, శారీరిక దృఢత్వానికి తోడ్పడతాయని కొత్వాల అన్నారు. ఈ కార్యక్రమాల్లో నిర్వాహకులు అలెక్స్, వరుణ్, రాకేష్, వాసు, ప్రతీక్, అనిల్, విక్కీ, రాజీవ్, నాని, జిల్లా ఒలింపిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి.యుగంధర్ రెడ్డి, ఉపాధ్యక్షులు వై వెంకటేశ్వర్లు , శనగ రామచందర్, గంధం నర్సింహారావు, జమ్మల శేఖర్, బండి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## సొంత డబ్బుతో రోడ్ల మరమ్మతులు

- వార్డ్ నెంబర్ ఆనగంటి కృష్ణ



**మునుగోడు, విశాలభారతి:** పలివెల గ్రామంలో మూడో వార్డు గ్రామ ప్రజలు గత 25 సంవత్సరాలు నుండి దాడి జితేందర్ రెడ్డి ఇంటి నుండి కొండోజు సత్యనారాయణ ఇంటి వరకు రాకపోకలు బందు కావడంతో మూడో వార్డ్ నెంబర్ ఆనగంటి కృష్ణ కి వార్డు ప్రజలు దృష్టికి తీసుకు రాగా వెంటనే స్పందించి తమ సొంత ఖర్చులతో జెసిబి తో రోడ్డు మరమ్మతులు వెంటనే చేయించారు మూడో వార్డు ప్రజలు మూడో వార్డు నెంబర్ ఆనగంటి కృష్ణకు ఉపసర్పంచ్ కి వార్డ్ నెంబర్లకు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చెరుకుపల్లి వెంకన్న ఉప సర్పంచ్ సునీత సైదులు వార్డ్ నెంబర్లు కొండూరి మాధవి మల్లికార్జున్ గోస్కొండ మల్లేష్ నాయకులు దాడి జితేందర్ రెడ్డి సొల్లేటి నరసింహ చారి పులిపాటి బిక్షం దాడి రాజేందర్ రెడ్డి మాధగోని శేఖర్ మార్త సత్తిరెడ్డి గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం




**నిజామాబాద్, విశాలభారతి:** మాక్లూర్ మండలం మాణిక్ బండార్ రెండవ డివిజన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2005 2006 సంవత్సరంలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాల మాణిక్ బండార్ లో ఏర్పాటు చేసుకున్నారు. పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ వారు విద్యను అభ్యసించిన జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను వదిలి వివిధ రంగాలలో స్థిరపడి, 20సంవత్సరాలు పూర్తయిన తర్వాత ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకొని కలవడం ఎంతో సంతోషంగా ఉందని,వారందరని ఎంతో కృషి పట్టుదలతో ఏకతాటిపై తీసుకువచ్చ శ్రీమతి, వాణి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 20 సంవత్సరాల జ్ఞాపకాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో గడిపిన జీవితాన్ని, గత స్మృతులను గుర్తుకు చేసుకొని ఆనందం వ్యక్తం చేశారు ఈ సంవత్సరము మాదిరిగానే ప్రతి సంవత్సరము ఇదేవిధంగా కలుసుకొని ఆనందంగా ఉండాలని సూచించారు ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఉపాధ్యాయులు శివమణి సంజు రెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

## గెలుపు కోసం యువజన కాంగ్రెస్ కృషి చేయాలి




**కోదాడ, విశాలభారతి:** కోదాడ పట్టణంలోని యువజన కాంగ్రెస్ కార్యాలయంలో నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ అబ్దుల్ అజీమ్ ఆధ్వర్యంలో ఆదివారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సూర్యాపేట జిల్లా ఇంచార్జ్ వెలిమినేటి సురేష్ గారు, సూర్యాపేట జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ కొమ్ము జోహార్, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ భాస్కర మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ ప్రధాన పాత్రను పోషించాలని, పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అబ్దుల్ అజీమ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలే ఎన్నికల విజయాలకు పునాది అని, కోదాడ నియోజకవర్గంలో జరుగుతున్న అనేక అభివృద్ధి కార్యక్రమాలు ఉత్తమ్, పద్మావతి రెడ్డి తోనే సాధ్యమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నడిగూడెం మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గుండు మహేందర్, మునగాల మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సాయి, చిలుకూరు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పుట్టపాక లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు వ్యతిరేకంగా వినూత్న ప్రచారం



**కోదాడ, విశాలభారతి:** యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూర్యాపేటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ వినూత్న ప్రచారం చేస్తున్నారు. ఆదివారం అనంతగిరి మండల కేంద్రంలో వ్యవసాయ పొలాల్లో పనిచేస్తున్న మహిళలు, కూలీలతో మైక్ పెట్టుకుని అమ్మలారా, అక్కలారా అంటూ మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన పట్ల ఒక కంట కనిపెట్టుకొని ఉండాలన్నారు. ముఖ్యంగా యువత గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా భవిష్యత్తుపై దృష్టి పెట్టి ఉన్నత విద్యలు అభ్యసించి తమపై తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశయాలను నెరవేర్చాలన్నారు.

## ఘనంగా మన రజక ఆత్మీయ సమ్మేళనం




- ఐక్యతతోనే రజకుల భవిష్యత్తు
- ఆర్టీవో ఎం.వి.ఐ సంగం వెంకట పుల్లయ్య

**మణుగూరు, విశాలభారతి :**

మండలంలోని సమ్మక్క సారక్క ఆలయం సమీపంలో రజక కులస్తులు ఐక్యంగా ముందుకు సాగుతూ అన్ని రంగాల్లో రాణించాలని భద్రాచలం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (ఎం.వి.ఐ) సంగం వెంకట పుల్లయ్య పిలుపునిచ్చారు. ఆదివారం తోగ్గుడెం సమీపంలోని శ్రీ సమ్మక్క సారక్క ఆలయం వద్ద మణుగూరు మండల రజక కుటుంబాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన రజక ఆత్మీయ సమ్మేళనం వన భోజనాలు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి సుమారు 1200 మంది రజకులు భారీగా హాజరై ఐక్యతను చాటుకున్నారు. కార్యక్రమానికి ముందు పీవీ కాలనీ క్రాస్ రోడ్ వద్ద ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంగం వెంకట పుల్లయ్య మాట్లాడుతూ రజకులు విద్య, ఉద్యోగాలు, వ్యాపార రంగాల్లో మరింత ముందుకు రావాలని, ప్రతి ఏడాది ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తూ పరస్పర కష్టసుఖాలను పంచుకోవాలని సూచించారు. ఐక్యతే రజకుల అభివృద్ధికి మూలమని ఆయన స్పష్టం చేశారు. సమ్మేళనంలో నిర్వహించిన మిమిక్రీ, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఐక్య కార్యక్రమాలు కొనసాగించాలని పలువురు వక్తలు ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రజక ఐక్యవేదిక సభ్యులు మరియు కార్యక్రమానికి సహకరించిన మీడియా మిత్రులను ఘనంగా సన్మానించి, వారి సేవలను కొనియాడారు. రజకుల ఐక్యతను సమాజానికి చాటి చెప్పడంలో మీడియా పాత్ర అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో చిటికెన భాస్కర్, పున్నం భిక్షపతి, వల్లంకొండ అప్పయ్య, పున్నం ఉమామహేశ్వరరావు, తనకం ముజాకర్, పొనగంటి కృష్ణ, రాపర్తి శ్రీహరి, అక్కినపల్లి సత్యనారాయణ, సట్టు యాకయ్య, పొన్నా కనకయ్య, కుమ్మరికుంట్ల సుధాకర్, ఆర్. రామ్మూర్తి, ఖంభంపాటి శ్రీనివాసరావు, చామంచుల శ్రీను, ఘంటసాల శ్రీను, నిమ్మల భాస్కర్, గంగాధర్, యాదగిరి, కుమ్మరికుంట్ల వెంకట సోములు, అక్కినపల్లి వెంకటేశ్వర్లు, అక్కినపల్లి ఏకస్వామి, ఐతరాజు మధు, ఐతరాజు సాయికుమార్, కుమ్మరికుంట్ల ఉదయ్ కుమార్, పగిళ్ల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## చదువులతో భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి



- వనవాసీకు వితరణ అందచేసిన కానిస్టేబుల్

**చర్ల, విశాలభారతి:**

ప్రతి విద్యార్థి చదువుతో తమ భవిష్యత్ కు బాటలు వేసుకోవాలని కానిస్టేబుల్ తోటపల్లి మురళీ అన్నారు. చర్ల పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా విదులు నిర్వహిస్తున్న మురళీ సింధుకుమారి దంపతుల కుమార్తె నియాన్షి జన్మదిన వేడుకలు చర్లలోని వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం విద్యార్ధి నిలయంకు 60 కేజీల బియ్యం, విద్యార్ధులకు భోజనం, స్వీట్స్, పండ్లను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మురళీ విద్యార్దులను ఉద్దేసించి ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ చదువులపై దృష్టిసారించాలని అన్నారు. క్రమశిక్షణతో మెలగి పాఠశాలలో బోధించే పాఠాలను శ్రద్ధగా వినాలని పేర్కొన్నారు. ఇతర వ్యాపకాలపై దృష్టిసారించకుండా చదువులపై మనస్సు నిమగ్నం చేయాలని సూచించారు. ప్రస్తుత రోజులలో విద్యా, ఉద్యోగ, ఉపాది అవకాశాలు ఉన్నందున ఉన్నత చదువులు చదివి జీవితంలో స్దిరపడాలని పేర్కొన్నారు. విద్యతో అనేక కుటుంబాలు స్థిరపడ్డాయని, ఇటువంటి వారిని ఆర్శంగా తీసుకోవాలని విజ్ఞప్తి చేసారు. వనవాసీ విద్యార్దులు క్రమశిక్షణ, సంస్కృతీ సంప్రదాయాలకు మారుపేరని, ఈ పేరును సార్దకత చేకురుస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్యార్దినిలయ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ మాట్లాడుతూ సంస్దకు వితరణ అందచేసిన మురళీ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్దులు దాతలు అందచేస్తున్న వితరణలకు సార్దకత చేకూరుస్తూ చదువులలో రాణించాలని కోరారు. విద్యార్దుల చదువులకు వితరణలను అందించేందుకు మరింత మంది ముందుకురావాలని తద్వారా వారి బంగారు భవిష్యత్ లో బాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నిలయ కమిటి ఉపాధ్యక్షులు గోగికార్ రాంలక్ష్మణ్, వనవాసీ ప్రఖండ ప్రముఖ్ గొంది శోభన్‌బాబు, నిలయ కమిటి సభ్యులు పాసికంటి శ్రీదేవి, పోలిన రమాదేవి, నిలయ ప్రముఖ్ గొంది ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

## గాంధీ పేరును ఉపాధి హామీ పథకం నుండి తీసేయడం దారుణం

కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు నల్ల శ్రీరామ్



**దేవరుప్పుల విశాలభారతి:** ఉపాధి హామీ పథకం నుండి మహాత్మా గాంధీ పేరును తొలగించిన బిజెపి ప్రభుత్వానికి నిరసనగా దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరామ్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ ఫోటోలతో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి ప్రధాన చౌరస్తా వరకు భారీ ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా నల్ల శ్రీరామ్ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడి పేరును ఉపాధి హామీ పథకం నుండి తొలగించడం దారుణమని, స్వాతంత్రం వచ్చేంత వరకు తన ప్రాణాలను కూడా లెక్కచేయకుండా అహర్నిశలు పోరాడిన వ్యక్తి ఫోటో తీసేయడం వెనుక కుట్ర పూరిత రాజకీయం ఉందని,కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన ఉపాధి హామీ పథకం ద్వారా ఈ దేశంలో ఎంతోమంది నిరుపేదలు లబ్ధిపొందుతుండగా బిజెపి ప్రభుత్వం అది జీర్ణించుకోలేక పోతుందని మండిపడ్డాడు.ఈ కార్యక్రమంలో జిల్లా,మండల, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, నూతన సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు,యువజన నాయకులు,మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెద్ది కృష్ణమూర్తి గౌడ్‌ను సన్మానించిన మిత్రులు



**దేవరుప్పుల, విశాలభారతి:** స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా దేవరుప్పుల మండలం, దేవరుప్పుల గ్రామ సర్పంచ్ గా నూతనంగా ఎన్నికైన పెద్ది కృష్ణమూర్తి గౌడ్ ను తన తోటి ఎస్ఎస్సి బ్యాచ్ మిత్రులు మర్యాద పూర్వకంగా కలిసి కేకును కోయించి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. పెద్ది కృష్ణమూర్తి గౌడ్ తోటి ఎస్ఎస్సి బ్యాచ్ మిత్రులు మర్రిపల్లి వెంకటేశ్వర్లు, తుడిమిల్ల మహేంద్ర చారి,కొంగ సతీష్ కుమార్,కల్లూరి శేఖర్,ఈదునూరి శ్రీనివాస్ రెడ్డి,నిమ్మల రవి,కలకుంట్ల యాకన్న,మహ్మద్ షబ్బీర్,మొలుగూరి రవీందర్,సుంకరబోయిన యాదగిరి,మహ్మద్ యాకుబీ, సునీత,అరుణ, చంద్రకళ, మాసంపల్లి మహేందర్, తోడేటి ఆంజనేయులు,నడిదే శ్రీను,దోర్నాల, ఉపేందర్, బొద్దుల సమ్మయ్య, తదితరులున్నారు.

## ఘనంగా కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**దేవరుప్పుల, విశాలభారతి:** దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవాలు ఘనంగా జరుపుకున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు.అందులో భాగంగానే దేవరుప్పుల మండల సింగరాజుపల్లి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు గ్రామపంచాయతీ ఆవరణలో గల రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కొండ పెద్ద మల్లారెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. పేదల కోసం పుట్టిన పార్టీ కాంగ్రెస్ అని, స్వాతంత్ర్య పోరాటంలో క్రియాశీలకంగా వ్యవహరించిన పార్టీ కాంగ్రెస్ అని,పార్టీని మరింత బలోపేతం చేసేలా నాయకులు, కార్యకర్తలు నిరంతరం పనిచేయాలని, దేశంలో,రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల,గ్రామ నాయకులు, యువజన నాయకులు,మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాలమూరు బిడ్డవైతే కేసీఆర్ కుటుంబాన్ని జైలుకు పంపు

**నిజామాబాద్, విశాలభారతి:**

రేవంత్ రెడ్డి నిజంగా పాలమూరు బిడ్డవే అయితే కేసీఆర్ కుటుంబాన్ని అరెస్టు చేయించు అని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ నిప్పులు చెరిగారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి వేల కోట్ల అవినీతికి పాల్పడిన కేసీఆర్ కుటుంబాన్ని కటకటాల్లోకి నెట్టే దమ్ము రేవంత్‌కు ఉందా? అని సవాల్ విసిరారు. ఆదివారం నిజామాబాద్ నగరంలోని అమృత గార్డెన్‌లో నిర్వహించిన 'బీజేపీ నూతన సర్పంచుల ఆత్మీయ సమ్మేళనం'లో అర్వింద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ చరిత్రలో అతిపెద్ద నమ్మకద్రోహి ఉద్యమ నేతగా కేసీఆర్ పట్ల తనకు గౌరవం ఉండేదని, కానీ ఇరిగేషన్ ప్రాజెక్టుల పేరుతో ఆయన తెలంగాణను నిలువునా ముంచారని మండిపడ్డారు. "ఇరిగేషన్ మీద తనకున్న అవగాహనను ఆసరాగా చేసుకుని దాదాపు 50 వేల కోట్లకు పైగా ప్రజా ధనాన్ని లూటీ చేశారు. కేసీఆర్ అంతటి పాపాత్ముడు, నమ్మకద్రోహి తెలంగాణ రాష్ట్రంలోనే మరొకరు లేరు. రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించిన ఘనత ఆయనదే" అని ధ్వజమెత్తారు. కేసీఆర్ ఫ్యామిలీని లోపలేస్తారనే నమ్మకంతో ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే.. ప్రస్తుతం వారి నుంచి రేవంత్ రెడ్డి 'ప్యాకేజీ'లు మాట్లాడుకుంటున్నారా? అని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. నీ చెల్లి కవిత నీ కోసం,నీ తండ్రి,బావ ల కోసం రాష్ట్రం మొత్తం తిరిగి చాటింపు చేస్తున్నారని అన్నారు. గత పది సంవత్సరాలుగా కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్ర మొత్తం దోచి గ్రామ వ్యవస్థను ఆరోగ్య వ్యవస్థను విద్య వైద్యం వ్యవసాయంలో పూర్తిగా నాశనం చేశారని ధ్వజమెత్తారు. చివరకు కూలిపోయే ప్రాజెక్టులు కట్టి లక్షల కోట్ల నీటుపాలు చేసి రూ 50 కోట్లు మింగారని ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పదేపదే కేసీఆర్ వయసును ప్రస్తావించడం వెనుక ఏదో పెద్ద మర్మమే ఉందని అర్వింద్ వ్యాఖ్యానించారు. తండ్రి ఆరోగ్యం, వయసును సాకుగా చూపి కేసుల నుంచి తప్పించుకోవాలనే కుట్ర సాగుతోందని ఆయన ఆరోపించారు. బీజేపీ గ్రహచారం బాగాలేక తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, కానీ ఆ అధికారాన్ని అవినీతి నిందితులను కాపాడటానికి వాడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ప్యాకేజీలు మాట్లాడుకుని కేసీఆర్ కుటుంబాన్ని వదిలితే తెలంగాణ ప్రజలు నిన్ను వదలరని రేవంత్ రెడ్డికి హెచ్చరించారు. తెలంగాణ లో దేవుళ్ళ మీద ఒట్లు వేసి దొంగ వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చారని అన్నారు.ప్రతిపక్ష నాయకుడిగా రెండేళ్లు ఫామ్ హౌస్ లో ఉంటారా అని ప్రశ్నించారు. రేపు మాకు నోటీసులు వస్తాయని ఫోన్ టాపింగ్ ఈ కార్ రేస్ కాళేశ్వరం అవినీతిపై నోటీసులు వస్తాయని భయంతో కేసీఆర్ బయటకు వచ్చాడని ఆరోపించారు. ఇక నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం 650 సర్పంచ్ స్థానాలకు బీజేపీ నుంచి 299 స్థానాలలో పోటీ చేయగా 98 మంది అభ్యర్థులు గెలిచారని పేర్కొన్నారు. గెలిచిన వారు అరవింద్ సహాయం లేకుండా గెలిచారని కొనియాడారు. 2019లో బిజెపి కార్యకర్తలు గెలిచిన స్థానాలు కేవలం ఐదే అని గుర్తు చేశారు. నేడు సుమారు వందసార్లు గెలవడంతో గ్రామాల్లో బిజెపి ఎంత బలంగా ఉందో అనడానికి ఇది నిదర్శనమని అన్నారు. అలాగే గతంలో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో బిజెపి నుంచి 27 మంది మున్సిపల్ స్థానాలు గెలిచారని అన్నారు. అలాగే నాటి ఎమ్మెల్సీ గా ఉన్న కవిత డబ్బులు ఇచ్చి కొంత మంది కార్పొరేటర్లను ఆరోపించారు. రాబోయే రోజుల్లో వచ్చే ఎన్నికల్లో ఇతర పార్టీలు అలా చేస్తే కవితకు పట్టిన గతి మీకు పడుతుందని అన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తే సుమారు 98 శాతం సర్పంచ్ స్థానాలు బిజెపి కైవసం చేసుకుంటుందని జోస్యం పలికారు. గెలిచిన సర్పంచులు మీ ఊరికి మీరే ముఖ్యమంత్రులు అని పేర్కొన్నారు. ఇక గ్రామాలకు వచ్చే నిధులు నేరుగా గ్రామ పంచాయతీ బ్యాంకు ఖాతాల్లోకి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వేస్తారని తెలిపారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్య నారాయణ, బిజెపి జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు స్రవంతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# గిన్నిస్ రికార్డు సాధించిన నాట్య గురు తిరుపతి స్వామి బృందం



కోదాడ, విశాలభారతి: శ్రీ తన్వి నటరాజ్ నృత్య పాఠశాల నిర్వాహకుడు నాట్య గురు తిరుపతి స్వామి తన పది మంది విద్యార్థులు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో తమ పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు ఈ రికార్డును సాధించారు. రికార్డులు సాధించిన విద్యార్థులు కుసుమ, హరిత, ఆధ్య, రక్షిత, అన్షి, మేఘన, తన్వి,దర్శిక, ద్యుతి, ఉద్విత పిల్లలతో పాటు, తల్లిదండ్రులు తమ పిల్లలు గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించడం గొప్ప విషయమని ఇది కోదాడ పట్టణానికి ఎంతో గర్వకారణమని అన్నారు. పిల్లలకు నృత్యంలో ఇంత అద్భుతంగా శిక్షణ ఇచ్చినందుకు నాట్యగురువు తిరుపతి స్వామికి వారు తమ కృతజ్ఞతలు తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు

**నిజామాబాద్, విశాలభారతి:** డొంకేశ్వర్ మండలం అన్నారం గ్రామ బిజెపి నాయకులు కార్యకర్తలు సుమారు 50 మంది వరకు ఆర్మూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొని కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వారిని సాదరంగా వినయ్ కుమార్ రెడ్డి పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా వినయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు సన్నబియ్యం ఉచిత బస్సు ఫ్రీకరంటూ రైతు రుణమాఫీ ఇందిరమ్మ ఇల్లు ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఎన్నో అభివృద్ధి మరియు సంక్షేమం రెండు కళ్ళ లాగా కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలిస్తున్నారు వారి పరిపాలన ప్రజా సంక్షేమం చూసి ఎంతోమంది బిజెపి కి చెందిన కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు అని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గడ్చంద్ రాజా శేఖర్ , ప్రతాప్, మున్నా, రంగారెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

# రోడ్డు విస్తరణ పనులకు బీజం నాటింది రేగా నే.

**బిఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ యాదవ్**



**అశ్వాపురం, విశాలభారతి:** అశ్వాపురం మండల కేంద్రాన్ని మరింత సుందరీకరణ గా మార్చి, విశాలవంతమైన రోడ్డు డ్రైనేజీ వ్యవస్థకు బీజం వేసింది బిఆర్ఎస్ ప్రభుత్వం లోని ఆనాటి పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే రేగా కాంతారావే నని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేంద్రర్ యాదవ్ అన్నారు. మండల అభివృద్ధి కొరకు ఎన్నో ఏళ్లుగా తీరని సమస్యగా ఉన్న డ్రైనేజీ, రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ కోసం గత ప్రభుత్వ హయాంలో రేగా కాంతారావు కోట్ల రూపాయలు తీసుకువస్తే ఆ పనులు పూర్తి చేయాలని, గ్రామ పంచాయతీ ప్రజల, వ్యాపారస్తుల ఇబ్బందులు తీర్చాలని ఈ రెండు సంవత్సరాల కాలంలో బి ఆర్ ఎస్ మండల కమిటీ అనుబంధ యువజన సంఘం ఆధ్వర్యంలో అనేకసార్లు ర్యాలీలు, ధర్నాలు, నిరసనలు, పత్రికా సమావేశాలు నిర్వహించి రెండు సంవత్సరాలుగా తట్టెడు మట్టి తీయకుండా, పనులు పూర్తిచేయకుండా ఉన్న ప్రభుత్వాన్ని నిద్రలేపటం జరిగిందన్నారు. ఇటీవల జరిగిన అశ్వాపురం మేజర్ గ్రామ పంచాయతీ ఎన్నికలలో ప్రజలు అధికార పార్టీ కి జలక్ ఇచ్చి గతంలో ఉన్న మెజార్టీ ను పూర్తిగా తగ్గించి ప్రజా సమస్యల పై పోరాడే బి ఆర్ ఎస్ పార్టీ ని విశ్వసించి ఓట్లు వేశారన్నారు. నేడు స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు ఇచ్చిన ప్రజా తీర్పుకు భయపడి గత్యంతరం లేక నేడు అధికార ప్రభుత్వం పనులు చేయవలసిన సందర్భం ఏర్పడిందన్నారు. వ్యాపారుల సౌకర్యాల కోసం కోట్ల రూపాయలు గత ప్రభుత్వం మంజూరు చేస్తే అదే వ్యాపారులను ఆ పనుల పూర్తి కోసం రోడ్లెక్కించిన ఘనత ఈ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ముమ్మాటికి లోని రోడ్డు విస్తరణ,సెంట్రల్ లైటింగ్,డ్రైనేజీ ల నిర్మాణం,రైల్వే స్టేషన్ రహదారి నిర్మాణం గొప్పతనం బి ఆర్ ఎస్ పార్టీకి,మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు కె దక్కుతుందన్నారు.

# లారీ ఢీ.. అక్కా, తమ్ముడు మృతి



**సత్తుపల్లి, విశాలభారతి:** వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో టూవీలర్‌పై ప్రయాణిస్తున్న అక్కా, తమ్ముడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ దుర్ఘటన సత్తుపల్లి పట్టణ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెనుబల్లి మండలం సూర్య బంజర్ తండాకు చెందిన పుచ్చ కృష్ణయ్య, రమ్యాదేవి దంపతుల కుమార్తె తేజస్విని (21)కి చింతలపూడి మండలం కంద్రిక వారి గూడెం గ్రామానికి చెందిన తోట మధుతో ఏడాదిన్నర క్రితం వివాహం జరిగింది. మృతురాలు తేజస్వినికి తమ్ముడు పుచ్చ దేవేందర్ (14) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మారెప్పగూడెం, చీపురుగూడెం ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. క్రిస్మస్ సెలవుల సందర్భంగా ఇంటికి వచ్చిన తమ్ముడిని, తల్లిదండ్రులను చూసేందుకు భార్యాభర్తలు తేజస్విని, మధు గ్రామానికి వెళ్లారు. అనంతరం తిరుగు ప్రయాణంలో పెనుబల్లి మండలం సూర్య బంజర్ నుంచి బయలుదేరి సత్తుపల్లి పట్టణ శివారులోని తమ్మిలేరు వంతెనపైకి చేరుకున్న సమయంలో ఖమ్మం నుంచి అశ్వరావుపేట వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి టూవీలర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టూవీలర్‌పై వెనుక కూర్చున్న తేజస్విని, ఆమె తమ్ముడు దేవేందర్ లారీ కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. టూవీలర్ నడుపుతున్న తోట మధు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని వెంటనే సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. ప్రమాదంలో మృతి చెందిన తేజస్విని, దేవేందర్ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ ఆచూకీ ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**దేశానికి స్వాతంత్రం తెచ్చిన పార్టీ ,తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ**



**విశాలభారతి, కరకగూడెం :** మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, డీసీసీ అధ్యక్షులు తోట దేవి ప్రసన్న ఆదేశాల మేరకు అఖిల భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ పార్టీ జెండా ఆవిష్కరించారు అదేవిధంగా బిజెపి కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేస్తూ పేరు మా కొత్త బిల్లును ప్రవేశపెట్టి పార్లమెంటులో ఆమోదించడంపై వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ. 141 సంవత్సరాల కాంగ్రెస్ పార్టీ దేశ స్వాతంత్రం తెచ్చిన గొప్ప చరిత్ర గల పార్టీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, అధికారంలో ఉన్న లేకున్నా ఎప్పుడు ప్రజల కోసం పాటుపడేది ఒక కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ స్థాపించి 140 సంవత్సరాలు పూర్తయి 141వ సంవత్సరంలోకి అడుగు పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో కరకగూడెం సర్పంచ్ పోలేబోయిన సుజాత, వెంకటాపురం సర్పంచ్ చౌలం కేశవరావు, కొత్తగూడెం సర్పంచ్ ఎర్రం పొట్టయ్య,తాటిగూడెం ఉపసర్పంచ్ గాంధర్ల రామనాథం, మాజీ సర్పంచ్ పోలేబోయిన తిరుపతయ్య,మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగబండి వెంకటేశ్వర్లు, మండల నాయకులు ఎర్ర సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి సర్పంచ్లను సన్మానించిన ధర్మపురి అరవింద్

**బిజెపి బలపరిచిన నాయకులను సన్మానించిన ఎంపీ అరవింద్**



**నిజామాబాద్, విశాలభారతి:** నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ పరిధిలో ఎన్నికైన సర్పంచ్ లు మరియు పాలకవర్గ సభ్యుల సన్మాన కార్యక్రమంలో ముల్లంగి బి . ధర్మపతి. వడ్డాట్ పల్లి సర్పంచ్ బడుగు సత్యనారాయణ. వెన్ కిషన్ నగర్ తాండసరోజా మాక్లూర్ వార్డ్ నెంబర్ రమేష్ నాయక్ అమ్రాట్ వార్డ్ నెంబర్ రమేష్.. ఉప సర్పంచ్ లను వివిధ పాలకవర్గ సభ్యులను ఎంపీ ధర్మపురి అరవింద్ శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు, గ్రామం ఏదైనా, పదవి ఏదైనా, పార్టీ ఏదైనా అందరి చూపు అందరి ఆలోచన ఒక్కటే భవిష్యత్తు మొత్తం బీజేపీదే అని భావించి బీజేపీలో చేరడమే లక్ష్యంగా పెట్టుకొని రోజు రోజుకు వందలాది మంది యువకులు పెద్ద ఎత్తున బీజేపీలో చేరడం చాలా సంతోషకరమని ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు.

# చరిత్ర ఘనం.. నేడు దైన్యం

- **శిథిలావస్థకు చేరిన నందివనపర్తి మహంకాళి అమ్మవారి ఆలయం**
- **ఎన్నో ఏళ్లుగా దూప దీప నైవేద్యాలకు అమ్మవారు దూరం**
- **ఆలయాన్ని పునర్నిర్మాణం చేయాలని గ్రామస్థుల విన్నపం**



**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**

రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని నందివనపర్తి గ్రామంలో మహంకాళి అమ్మవారి దేవాలయం శిథిలావస్థకు చేరుకుంది. ప్రహరి గోడలు పుర్తిగా కూలిపోవడంతో చరిత్రకు సాక్ష్యం లేకుండా పోతున్నాయని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. మహంకాళి అమ్మవారి దేవాలయం ఎంతో ప్రాచీనమైనదని వందల సంవత్సరాల క్రితం వీటి నిర్మాణం జరిగిందని చరిత్ర చెబుతోంది. రంగారెడ్డి జిల్లాలోని దేవాలయాలకు పుట్టినిల్లుగా నందివనపర్తిని పిలుస్తారు. అలాంటి గ్రామంలో ఈ దేవాలయం ఒకటి. ఈ ప్రాచీన ఆలయాలు ధూప దీప నైవేద్యాలకు నోచుకోవడం లేదు. వీటికి రక్షణ లేకపోవడంతో కొంతమంది దుండగులు ధ్వజస్తంభాలను ధ్వంసం చేస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నందివనపర్తిలో ఉన్న ప్రాచీన దేవాలయం శిథిలావస్థకు చేరుకుందని బతుకమ్మ పండగ సందర్భంలో ఆలయం ముందు బతుకమ్మలు పెట్టి గ్రామ అడబిడ్డలు ఆడుతారు. పండగ వేళల్లో దేవాలయంలో పూజలు నిర్వహిస్తూ ఉంటారని మరెప్పుడు దూపమ్, దీప నైవేద్యాలకు నోచుకోవడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామస్తుల అంగీకారంతో దేవాలయం పునరుద్ధరించడానికి ప్రజాప్రతినిధులు, దాతలు ముందుకు వచ్చి చరిత్రను చెప్పే మహంకాళి అమ్మవారి దేవాలయాన్ని పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. గత చారిత్రక విశేషాల ఆధారాలు నందివనపర్తి గ్రామంలో ఉన్నాయని వాటిని పరిరక్షించేందుకు పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. భవిష్యత్ తరాలకు చరిత్రను తెలిపే ఈ సాక్షాలు ఇలాగే కాపాడు కోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని అంటున్నారు.

**కనుమరుగవుతున్న దేవాలయం..**

ఆలయ గర్భగుడి , ప్రవారి సగానికి పైగా పెచ్చు లూడి అయింది. ప్రమాదకరంగా మారింది. ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి, దేవాదాయ శాఖ అధికారులు కల్పించుకొని దేవాలయాన్ని పునర్నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# నరసింహమూర్తి సేవలు ఆదర్శనీయం



- **ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన వ్యక్తి**
- **సహచరున్ని కోల్పోవడం బాధాకరం**
- **వర్ధంతి సభలో మాట్లాడుతున్న అడ్వకేట్ అవులూరి సత్యనారాయణ**

**భద్రాచలం, విశాలభారతి:**

భద్రాచలంలోని టీఎన్జీవో హాల్లో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు అలవాల రాజా మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన నర్సింమూర్తి యాది సభ లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ అడ్వకేట్ అవులూరి సత్యనారాయణ పాల్గొని మాట్లాడుతూ భద్రాచలం డివిజన్లో ఎమ్మార్పీఎస్ కు నరసింహమూర్తి సేవలు మరువలేనివని ఆయన కొనియాడారు వర్గీకరణ ఏర్పాటుకు మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపులో భాగంగా భద్రాచలం డివిజన్లో క్రియాశీలక పాత్ర పోషించాడని అటువంటి నాయకుడిని కోల్పోవటం చాలా బాధాకరమని ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి తీరని నష్టమని ఆయన అన్నారు నరసింహమూర్తి పట్టుదల అందర్నీ కలుపుకొని పోయే తత్వం మంచి వ్యక్తి అని సామాజిక ఉద్యమ నేత డాక్టర్ భాను ప్రసాద్ కొనియాడారు ఎమ్మార్పీఎస్ తొలి తరం ఉద్యమ నాయకులు మన మధ్య లేకపోవడం చాలా బాధాకరమని అందరిని కలుపుకొని పోయిన మంచి వ్యక్తిని ఎమ్మార్పీఎస్ ఉద్యమంతో పాటు అందరితోనూ సొంత వ్యక్తుల నడుచుకునే వాడని మానవత్వం కలిగిన గొప్ప నాయకుడని బహుజన్ సంక్షేమ పరిషత్ నాయకులు ఏవి రావు తెలిపారు ఇదే సందర్భంలో పెరియర్ వర్ధంతిని కూడా ఘనంగా నిర్వహించారు ప్రజలు మూఢ నమ్మకాలపై అవగాహన కలిగి ఉండాలని శాస్త్రీయ దృక్పథాన్ని కలిగినప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందని వక్తలు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కూరపాటి వీరరాజు మాదిగ కొమ్ము హుస్సేన్ మాదిగ రావులపల్లి ఆర్ పి ఐ పార్టీ నాయకులు జ య బాబు సత్యం మాదిగ మహాజన మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు మేకల లత తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలి

**కోదాడ, విశాలభారతి:** ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం ఒక అర ఎకరంలో చేయాలని వ్యవసాయ సామాజిక కార్యకర్త , కిసాన్ సేవా రత్న పురస్కారం గ్రహీత డాక్టర్ మొలుగూరి గోపయ్య (గోపి ) కోరారు. ఆదివారం నడిగూడెం మండల కేంద్రం తో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాలలో స్వచ్ఛందంగా చేపట్టిన ప్రకృతి వ్యవసాయం పై రైతు చైతన్య యాత్ర కార్యక్రమంలో ఆయన రైతులతో మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాగులో అనేక మార్పులు వచ్చాయని దీంతో జబ్బులతో బాధ పడుతున్నమన్నారు. గత అరవై ఏళ్లుగా చేస్తున్న రసాయన వ్యవసాయంతో నేల పూర్తిగా దెబ్బతిన్నదన్నారు. కాబట్టి నేల ఆరోగ్యమే పంట ఆరోగ్యమని, పంట మన ఆరోగ్యం అన్నారు. అనంతరం సహజ సిద్ధ పద్ధతులతో చీడ పీడల నివారణ, భూసారం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నడిగూడెం, రామాపురం గ్రామాల సర్పంచ్ లు దున్న శ్రీనివాస్, భూత్కూరి వెంకటరెడ్డి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



# కేంద్ర ప్రభుత్వ కుట్రలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ మహాధర్నా



**మణుగూరు, విశాలభారతి :** కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా మహాత్మా గాంధీజీ పేరు మీద అమలులో ఉన్న గాంధీ ఉపాధి హామీ పథకం పేరును మార్చి దేశ ప్రజలను వంచించేందుకు ప్రయత్నిస్తున్నదని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. గాంధీజీ ఆశయాలను, రాజ్యాంగ విలువలను కాలరాస్తూ పేదలు, కూలీలు, గ్రామీణ ప్రజల హక్కులను హరించాలనే కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా, ఏఐసీసీ ఆదేశాల మేరకు ఆదివారం మణుగూరు పట్టణంలోని ఎస్బీఐ బ్యాంక్ ముందు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మణుగూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు పిరినాకి నవీన్ గారు నాయకత్వం వహించగా, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఈ నిరసన కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గాంధీ ఉపాధి హామీ పథకం కోట్లాది పేద కుటుంబాలకు జీవనాధారంగా మారిన చారిత్రక పథకమని, అలాంటి పథకం పేరును మార్చడం ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేయడమే కాకుండా గాంధీజీ ఆశయాలపై ప్రత్యక్ష దాడి చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. ఇది కేవలం పేరు మార్పు కాదని, పేదల ఉపాధిపై, గాంధీజీ గౌరవంపై, రాజ్యాంగ విలువలపై చేసిన దాడిగా అభివర్ణించారు. పేదల హక్కుల పరిరక్షణ కోసం, గాంధీజీ ఆశయాలను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ చివరి వరకు పోరాడుతుందని స్పష్టం చేస్తూ, కేంద్ర ప్రభుత్వం తన ప్రజావ్యతిరేక నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఈ మహాధర్నా ద్వారా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పీరినాకి నవీన్ , టౌన్ అధ్యక్షులు శివ సైదులు, నియోజకవర్గ కోఆర్డినేటర్ కాటిబోయిన నాగేశ్వరరావు, పి సుధాకర్ రెడ్డి, సామ శ్రీనివాస్ రెడ్డి, శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు, మైనారిటీ అధ్యక్షులు రహీం భాషా , ఉప సర్పంచ్ సురేష్, వార్డు మెంబర్ రాజేష్ , మానస, మంగతాయి, జీవరత్నం , చింతల కృష్ణ, మండల ముఖ్య నాయకులు, నాయకురాళ్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్యం కోసం కాంగ్రెస్ మహోన్నతమైన త్యాగాలు



**మణుగూరు, విశాలభారతి :** దేశ స్వాతంత్ర్య పోరాటానికి దిశానిర్దేశం చేసిన భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ స్థాపన దినోత్సవాన్ని పురస్కరించుకొని, ఐఎన్టీయూసీ బొగ్గు బుటా కార్మిక సంఘం, 14 టిప్పర్ యూనియన్ అసోసియేషన్, మణుగూరు లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఆదివారం నాడు సింగారం గ్రామపంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై, కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి గర్వంగా ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం అందించడంలో కాంగ్రెస్ పార్టీ చేసిన మహోన్నతమైన త్యాగాలు, అమర వీరుల అపూర్వ పోరాటాలు, లక్షలాది కార్యకర్తల అంకితభావాన్ని స్మరించుకున్నారు. మహాత్మా గాంధీ అహింసా ఉద్యమం నుంచి జవహర్లాల్ నెహ్రూ దూరదృష్టి వరకు, సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ ఐక్యత పాత్ర నుంచి, ఇందిరాగాంధీ ధైర్య నిర్ణయాల వరకు ప్రతి దశలో కాంగ్రెస్ పార్టీ దేశ గౌరవాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడిందని ఆయన తెలిపారు. కార్మిక వర్గానికి హక్కులు, గౌరవం, భద్రత కల్పించిన పార్టీ కాంగ్రెస్ అని, ఐఎన్టీయూసీ వంటి కార్మిక సంఘాల ద్వారా కార్మికుల సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాడుతూ వారి పక్షాన నిలిచిన పార్టీ కాంగ్రెస్ పార్టీయేనని స్పష్టం చేశారు. రైతులు, పేదలు, మహిళలు, యువత సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల మధ్య పనిచేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు పీరినాకి నవీన్ , టౌన్ అధ్యక్షులు శివ సైదులు, శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు,బొగ్గు ముఠా అధ్యక్షులు రాంబాబు, 14 టైర్ యూనియన్ అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, 12 టైర్ సెక్రటరీ సురేందర్ రెడ్డి, సమితి సింగారం ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, వార్డు మెంబర్లు,మండల ముఖ్య నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం



**కోదాడ, విశాలభారతి:** మునగాల మండల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్ రెడ్డి కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలను గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తీసుకువచ్చిన ఉపాధి హామీ పథకం వల్ల గ్రామీణ పేదలకు పని, ఆదాయం లభించిందని చెప్పారు. పేదల కోసం నిలబడిన పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని, ప్రజల సమస్యలపై కాంగ్రెస్ ఎప్పుడూ పోరాటం చేయడంలో ముందుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జానకిరామ్ రెడ్డి కోదాడ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ కాసర్ల కోటేశ్వరరావు, కాసర్ల శ్రీనివాసరావు, నల్లపాటి శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, మండల యూత్ అధ్యక్షుడు తక్కెళ్లపాటి సాయి,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సామాన్య కార్యకర్తను అందలం ఎక్కిస్తుంది

**హైదరాబాద్, విశాలభారతి:** హైదరాబాద్ సెంట్రల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడి గా మోత రోహిత్ ప్రమాణ స్వీకార కార్యక్రమం లో రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సామాన్య కార్యకర్త ను అందలం ఎక్కిస్తుందని.. దానికి నేనే ఉదాహరణ అని అన్నారు. వీ. హెచ్ హనుమంత రావు, అనిల్ కుమార్ యాదవ్, బల్మూరి వెంకట్, శివసేనా రెడ్డి లాంటి వారందరు చిన్న కార్యకర్త స్థాయి నుండి వచ్చిన వారేనని గుర్తు చేశారు..యూత్ కాంగ్రెస్, ఎన్.ఎస్.యు.ఐ లు రెండూ జోడెద్దుల్లాగా పని చేయాలన్నారు. జంట నగరాల్లో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావడానికి మోత రోహిత్ కృషి చేయాలన్నారు మంత్రి వాకిటి శ్రీహరి. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో, మొన్న జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కి అద్భుత ఫలితాలొచ్చాయన్నారు. దీంట్లో ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త కృషి ఉందని తెలిపారు. అదేవిధంగా గతంలో చంద్రబాబు హయాం లో రెండు సార్లు, వైస్ రాజశేఖర్ రెడ్డి టైం లో రెండుసార్లు, అభివృద్ధి ఏమీ చేయకపోయినా మాయ మాటలు చెప్పిన కెసిఆర్ కు రెండుసార్లు ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఈ రాష్ట్ర ప్రజలు ఇచ్చారని మళ్లీ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అవకాశం ఇస్తారన్నారు. అవకాశం వచ్చినప్పుడు ప్రతి కార్యకర్తకి పదవులు దానంతట అవే వస్తాయి అన్నారు. బడుగు, బలహీన వర్గాల గురించి ఆలోచించే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను అందరికి తెలిసేలా ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలన్నారు. నూతనంగా ఎన్నికైన డిసిసి ప్రెసిడెంట్ రోహిత్ అందరినీ కలుపుకొని ముందుకు వెళ్లాలని, ప్రతి కార్యకర్త సమస్య విని వాటిని పరిష్కరించే దిశగా కృషి చేయాలని హితబోధ చేశారు. నీ వెనక మేముంటామని భరోసానిచ్చారు. డిసిసి ప్రెసిడెంట్ గా ఎన్నికైన మోత రోహిత్ కి శుభాకాంక్షలు తెలిపి, ఈ అవకాశం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మోత రోహిత్‌ని శాలువాతో మంత్రి వాకిటి శ్రీహరి సత్కరించారు.



## రిపోర్టర్ తల్లిని పరామర్శించిన మాజీ పీఏసీఎస్ చైర్మన్



**మహబూబాబాద్, విశాలభారతి:** తొర్రూరు మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన జర్నలిస్టు పులి సతీష్‌కుమార్ తల్లి సారమ్మ గుండె సమస్యతో బాధపడుతు హైదరాబాద్ లోని నిమ్స్ హాస్పిటల్లో గుండె ఆపరేషన్ చేయించుకుని చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ పిఏసిఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్ నిమ్స్ హాస్పిటల్‌కు వెళ్లి వారిని పరామర్శించి, డాక్టర్లతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్లను కోరారు.

## 24 గంటలు ప్రజాసేవలో ఉంటాను: ఈటల



**హైదరాబాద్, విశాలభారతి:** నార్త్ ఇండియన్ అసోసియేషన్స్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేను సీరియస్ పొలిటీషియన్, 24 గంటలు ప్రజాసేవలో ఉంటాను. సమస్య విని వదిలివేసే వాడిని కాదు. పరిష్కారం కోసం కృషి చేసేవాడిని. మీరు వేరు వేరు రాష్ట్రాల నుండి ఇక్కడికి వచ్చారు. కరోనా సమయంలో 16 లక్షల మంది ఇక్కడి నుండి వెళ్లినప్పుడు తెలిసింది ఎంతమంది ఇక్కడ ఉన్నారని. హైదరాబాద్ కాస్మోపాలిటన్ సిటీ. ముఖ్యంగా మల్కాజ్గిరి మినీ ఇండియా. అన్ని రాష్ట్రాల వారు ఇక్కడ ఉంటున్నారు. కొత్తగా చాలా కాలనీలు ఇక్కడ ఏర్పడ్డాయి. వీటిల్లో మంచినీరు, డ్రైనేజీ చాలా సమస్యలున్నాయి. వాటిని అన్నీ పరిష్కరించడానికి తెలంగాణ ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవు. మీ సమస్యలు ఏమున్నా నా దృష్టికి తీసుకురండి వాటిని పరిష్కరిస్తాం. నియోజకవర్గ ప్రజలను కుటుంబ సభ్యులలాగా ఎవరు చూస్తారో వారికే ప్రజల ఆశీర్వాదం లభిస్తుంది. పాజిటివ్ ఓట్ లభిస్తేనే విజయం సాధిస్తారు. ఈవీఎం వల్ల ఓడిపోయాం అని కాంగ్రెస్ నేతలు చెప్తున్నారు. మీరు గెలిస్తే అంత ఒప్పు జరిగినట్టు, ఓడిపోతే తప్పు జరిగినట్టా. ప్రజలతో మమేకం అవ్వండి, చిల్లర రాజకీయాలు మానెయ్యాలని వారికి నా హితవు. మోదీ వచ్చాక దేశం అభివృద్ధి దిశగా దూసుకుపోతుంది. ఒకప్పుడు దేశంలో రెండు ఎంపీలు గెలిస్తే ఒకటి తెలంగాణ నుండి గెలిచింది. కానీ ఇన్నేళ్లు అయినా ఇక్కడ బీజేపీ అధికారంలోకి రాలేకపోయింది. తెలంగాణలో అధికారంలోకి రావాలి అనేది ఇప్పుడు జాతీయ పార్టీ లక్ష్యం. అందుకోసం మేమంతా కృషి చేస్తున్నామని అన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు మల్లారెడ్డి, గిరివర్ధన్ రెడ్డి, గోపు రమణారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, వివిధ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర దేవాలయానికి భద్రాచల ముక్కోటి ఆహ్వానం



**సిద్దిపేట (దుబ్బాక) , విశాలభారతి:** సిద్దిపేట జిల్లా గజ్వేల్ వెంకటేశ్వర దేవాలయంలో భద్రాచల దేవస్థాన ముక్కోటి ఏకాదశి ఆహ్వాన పత్రికలు, గోద పత్రికలను ఆదివారం నాడు భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు ఆవిష్కరించి దేవాలయానికి అందజేశారు. ఉత్తర ద్వారం ద్వారా ముక్కోటి దేవతల దర్శనం భాగ్యం పొందడం ఎన్నో జన్మల పుణ్యఫలం అని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కైలాస లక్ష్మణ్, ప్రధాన అర్చకులు శేషం శ్రీనివాసచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్య సంక్షేమం కోసం కృషి చేస్తా మాజీ ఎంపీపీ ప్రతాపరెడ్డి

**పెద్దకొడప్గల్ , విశాలభారతి:** పెద్దకొడప్గల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాజీ ఎంపీపీ ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత ఆరోగ్య క్యాంపుకు భారీ స్పందన లభించింది. మండలంలోని పలు గ్రామాల నుండి వచ్చిన ప్రజలు సుమారుగా 310 మంది ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో గుండె సంబంధిత నిపుణుడు మహేష్ కుమార్ పాల్గొని పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో 50 నుంచి 60 మంది వరకు పలు రకాల వ్యాధులతో ఇబ్బంది పడుతున్నట్లు నిర్ధారించారు. 5 మందికి 2డికో పరీక్షలు నిర్వహించగా వారు గుండె సంబంధిత వ్యాధితో ఉన్నట్లు తెలిపారు. వారు అలక్ష్యం చేయకుండా ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, స్థానిక అరెంపీలు, పీఎంపీలు పాల్గొన్నారు.

## నేతలపై నమ్మకంతోనే చేరికలు: బొబ్బిలి రామకృష్ణ

**10వ డివిజన్లో కాంగ్రెస్ జోరు: చేరిన 150 మంది**

**నిజామాబాద్, విశాలభారతి:** భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిజామాబాద్ నగరంలో కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు జరిగాయి. నగర కార్పొరేషన్ పరిధిలోని పదవ డివిజన్‌లో నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ అధ్యక్షతన డివిజన్ నాయకులు షాదాబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుమారు 150 మంది బీజేపీ మరియు బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుండి పెద్ద ఎత్తున కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో ఖదీర్, అమీర్, షోయబ్, మజార్‌లతో పాటు 150 మంది కార్యకర్తలు ఉన్నారు. కొత్తగా చేరిన వారందరికీ పార్టీలో సముచిత గౌరవం ఉంటుందని అందరూ కలిసికట్టుగా కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచారెడ్డి చరణ్, రిజ్వాన్, హుస్సేన్, జాఫర్, ఆషాభి, అన్వర్ మరియు డివిజన్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కల్మషం లేని వ్యక్తికి కాటేసిన కాలం... అరవింద్ మృతితో శోకసముద్రంలో బోల్సా గ్రామం



**తానూర్ , విశాలభారతి:** నిర్మల్ జిల్లా తానూర్ మండలం బోల్సా గ్రామానికి చెందిన జవారి అరవింద్ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. కల్మషం లేని వ్యక్తిని కాలమే కాటేసిందని గ్రామస్తులు కన్నీటి పర్వతమయ్యారు. వృత్తిరీత్యా భైంసా ఏరియా ఆసుపత్రిలో అసిస్టెంట్‌గా తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్న అరవింద్ విధులు ముగించుకుని స్వగ్రామానికి తిరిగి వస్తున్న క్రమంలో శనివారం సాయంత్రం గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. రోడ్డుపై అపస్మారక స్థితిలో ఉన్న అరవింద్‌ను గమనించిన స్థానికులు వెంటనే బంధువులకు సమాచారం అందించగా, ఆయనను భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ వార్త తెలిసిన వెంటనే గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎవరికైనా ఆపద కలిగితే ముందుండి వైద్య సహాయం అందించేందుకు తపించే వ్యక్తిగా అరవింద్‌కు మంచి పేరు ఉండేది. ఆసుపత్రిలోని వైద్యులతో సమన్వయం చేస్తూ, అవసరమైన వారికి తన వంతు సహాయాన్ని అందిస్తూ సమాజసేవలో చురుగ్గా పాల్గొనేవాడని గ్రామస్తులు చెబుతున్నారు. అరవింద్ మృతితో భైంసా పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు చెందిన పలువురు ప్రముఖ వైద్యులు కూడా తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఒక మంచి మనిషిని కోల్పోయామంటూ వారు కన్నీరు పెట్టుకున్నారు. ఇక బోల్సా గ్రామం మొత్తం శోకసముద్రంలో మునిగిపోయింది. అరవింద్‌కు భార్య, చిన్న కుమార్తె ఉండగా, కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న ఆయన అకాల మరణంతో తల్లిదండ్రులు, బంధువులు తీరని దుఃఖంలో మునిగిపోయారు. ఇప్పటికే ఆర్థికంగా పేద కుటుంబమైన అరవింద్ కుటుంబం మొత్తం బాధ్యతలను ఆయన ఒంటరిగా మోస్తూ జీవనం సాగించేవాడు. అలాంటి సమయంలో మృత్యువు కబళించడంతో ఆ కుటుంబ భవితవ్యంపై ఆందోళన నెలకొంది. గ్రామంలోనూ, సన్నిహిత వర్గాల్లోనూ అరవింద్ జ్ఞాపకాలు, ఆయన చేసిన సేవలు గుర్తుకొచ్చి కన్నీళ్లు మున్నీరుగా మారుతున్నాయి. ఒక మంచి వ్యక్తిని కోల్పోయిన బాధతో బోల్సా గ్రామం మొత్తం మౌనంగా విలపిస్తోంది.

## కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం ఘనంగా చేపట్టిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు



**రెంజల్ , విశాలభారతి:** రెంజల్ మండల కేంద్రంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారులు, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం మాజీ ఎంపీపీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోబిన్ ఖాన్ 141వ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోబిన్ ఖాన్ మాట్లాడుతూ ఆసియా ఖండంలో 1885 డిసెంబర్ 28 ఏవోహ్యూమ్ కాంగ్రెస్ పార్టీ స్థాపించినా మహనీయులు, డబ్ల్యుసి బెనర్జీ మొదటిసారిగా అధ్యక్షులుగా కొనసాగారు. బ్రిటిష్ సామ్రాజ్యంలో బాలగంగాధర్ తిలక్, మహాత్మా గాంధీ, జవర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, సుభాష్ చంద్రబోస్ కాంగ్రెస్ లో ఉంటూ స్వతంత్ర ఉద్యమంలో పోరాడి స్వాతంత్రం సాధించడానికి దోహదపడ్డా మహనీయులని గుర్తు చేశారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్చడం విరమించుకోవాలని మహాత్మా గాంధీ విగ్రహ కూడలి లో కేంద్ర ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దండిగుట్ట సర్పంచ్ ధనుంజయ్, అంబేద్కర్ నగర్ సర్పంచ్ వాగ్మారే మాధవ్, సి డి సి మాజీ డైరెక్టర్ సాయిబాబా గౌడ్, బాగేపల్లి సురేందర్ గౌడ్ , కూనేపల్లి ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షులు ఇందిరా రెడ్డి, ప్రధాన కార్యదర్శి సిహెచ్ రాములు, వీరన్న గుట్ట మాజీ సర్పంచ్ వినోద్, రెంజల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సగ్గు వెంకటి, ఉపాధ్యక్షులు గైని సాయిలు, సాయ గౌడ్, అంబేద్కర్ నగర్ రాము, నీలా గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సోక్కుల సాయిలు, బోర్గం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంగాధర్, తదితరులు ఉన్నారు.

## ఎన్.ఎస్.ఎస్. అడ్వంచర్ క్యాంప్ ముగించుకున్న త్రిబుల్ ఐటీ విద్యార్థి బృందం




**బాసర , విశాలభారతి:** యువతను సాహసం, సేవ ద్వారా శక్తివంతంగా తీర్చిదిద్దడానికి "అటల్ బిహారీ వాజపేయి మౌంటెనీరింగ్, అల్లాయిడ్ స్పోర్ట్స్ ఇన్‌స్టిట్యూట్, పాంగ్ డామ్, హిమాచల్ ప్రదేశ్" తలపెట్టిన శిబిరానికి ఎన్నికైన రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ బాసర విద్యార్థి బృందం ఈ నెల 15 నుండి 24 వరకు జరిగిన హిమాచల్ ప్రదేశ్‌లోని ఎన్.ఎస్.ఎస్. అడ్వంచర్ క్యాంప్ ను విజయవంతంగా ముగించుకుంది. ఈ ఏడాది ఆర్జీయూకేటీ బాసర నుండి ఐదుగురు ప్రతిభావంతులైన ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్స్—కే. ప్రవలిక, బి. వీర మల్లేశ్వర్, కే.సాయి రాహుల్, ఎన్. శివాంశ, మరియు ఎమ్. స్వాతి—ప్రతిష్ఠాత్మకమైన ఈ క్యాంపులో పాల్గొన్నారు. వీరితో పాటు ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. ఎస్. శ్రవణ్ కుమార్ కూడా క్యాంపుకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల నుండి కూడా జట్లు పాల్గొన్నాయి. పాంగ్ డామ్, హిమాచల్ ప్రదేశ్ లోని ప్రకృతి సుందరమైన వాతావరణంలో నిర్వహించబడిన ఈ క్యాంపులో, వాలంటీర్లు వివిధ అడ్వంచర్ స్పోర్ట్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, టీమ్‌బిల్డింగ్ వ్యాయామాల్లో పాల్గొన్నారు. నాయకత్వం, క్రమశిక్షణ, జట్టుగా పనిచేయడం, ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవడం నేర్చుకున్నామని విద్యార్థి బృందం తెలిపింది. ఈ క్యాంప్ ఒక వ్యక్తిగత అభివృద్ధి ప్రయాణంగా నిలిచింది, ఇది వాలంటీర్స్‌లో సామాజిక దృక్పథాన్ని, సేవాయాత్రకు సంబంధించిన దృఢమైన భావనను పెంపొందించింది. ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ముగించుకొని వచ్చిన విద్యార్థి బృందానికి ఉపకులపతి ప్రొఫెసర్ ఏ. గోవర్ధన్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ టి. రాకేష్ రెడ్డి, డాక్టర్ ఎస్ శ్రవణ్ కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ జెండా ఎగురవేసిన కాంగ్రెస్ నాయకులు

**ఉపాధి హామీ పథకం పేరు మార్పు పై కాంగ్రెస్ నాయకుల నిరసన**



**నిజామాబాద్, విశాలభారతి:** మాక్లూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ 140వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు డాక్టర్ రవి ప్రకాష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసి ఘనంగా నిర్వహించారు. మండల నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చరిత్ర, దాని సాధించిన విజయాలు భారతదేశానికి చేసిన కృషి గురించి మాట్లాడరూ భారతదేశానికి స్వాతంత్ర్యం తర్వాత కాంగ్రెస్ పార్టీ దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించింది. పంచవర్ష ప్రణాళికలు, లౌకికవాదం, సామాజిక న్యాయం వంటి సిద్ధాంతాలు కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిందన్నారు. స్వతంత్రం అనంతరం చాలా సంవత్సరాలు కాంగ్రెస్ అధికారంలో ఉండి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించింది. ఈ రోజు కూడా కాంగ్రెస్ పార్టీ భారతదేశంలోని ప్రధాన రాజకీయ శక్తిగా ఉందని కొనియాడారు. అనంతరం బిజెపి ఉపాధిహామి పథకం పేరు మార్చడానికి వ్యతిరేకంగా నల్ల రిబ్బన్లు దరించి గాంధీ విగ్రహం ముందు నిరసన చేపట్టారు మార్చిన ఉపాధిహామి పథకం పేరు ను తిరిగి ఎంఈఎన్జిఆర్‌ఏ గా పెడుతూ నిర్ణయం తీసుకోకపోతే ఎద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని బిజెపి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామపంచాయతీ శాఖ అధ్యక్షులు గంగాధర్ గౌడ్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్ సొసైటీమాజీ చైర్మన్ బూరల అశోక్ మాక్లూర్ గ్రామాల సర్పంచులు వెంకటేశ్వరరావు చిన్నాపూర్. సర్పంచ్ చిన్న గంగాధర్ పాల్గొన్నారు

## ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి

**వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు**



**కోదాడ, విశాలభారతి:** యూపీ వన్ ప్రభుత్వంలో వామపక్ష పార్టీలు పోరాడి సాధించుకున్న చట్టాన్ని రద్దుచేసి 'జి రాంజీ' పేరుతో కొత్త పథకాలు తీసుకొచ్చి అంతిమంగా మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు విమర్శించారు. ఆదివారం కోదాడ పట్టణంలో స్థానిక రంగా థియేటర్ సెంటర్లో వ్యవసాయ కార్మిక సంఘం సిఐటియు రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ ఈ చట్టంలో ఉన్న గాంధీజీ పేరును తొలగించడం చాలా అన్యాయమని వెంటనే ఈ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నరేంద్ర మోదీ సర్కార్ అధికారులకు వచ్చిన నాటినుండి ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయాలని ప్రయత్నంలో భాగమైనని వారు విమర్శించారు. దేశానికి స్వాతంత్రం తెచ్చిన గాంధీజీ పేరు తొలగించి అంతిమంగా ఈ పథకానికి గాడ్సే పేరును పెట్టాలని ప్రయత్నిస్తుందని వారు విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో నూటికి 80 శాతం ఉన్న వ్యవసాయ కార్మికుల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది అన్నారు. 'జి రామ్ జి' పేరుతో తెచ్చిన ఈ పథకాన్ని రద్దుచేసి వ్యవసాయ కార్మికులకు ఉపయోగపడే మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి పథకం కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి చట్టంలో సంవత్సరానికి ₹200 పని దినాలు రోజుకు 800 రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశార. కేంద్ర ప్రభుత్వం మోదీ సర్కార్ కార్మిక రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని వారు దుయ్యబట్టారు. ఈ యొక్క కార్యక్రమంలో గీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం ముత్యాలు, వివిధ ప్రజా సంఘాల నాయకులు వీ రాముడు, వీరయ్య, రామారావు, తిరపయ్య వెంకటేశ్వర్లు సైదులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవం

**సీనియర్ కాంగ్రెస్ నాయకులు పోకల దేవదాసుకు సన్మానం**



**చిట్యాల, విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేద్రంలో కేక్ కట్ చేసి జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. తదనంతరం నల్గొండ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పోకల దేవదాసు తన చిన్నతనం నుండి దాదాపు 45 సంవత్సరాలు గా కాంగ్రెస్ పార్టీలో ఉండి ఇప్పటి వరకు ఏ ఇతర పార్టీలకు వెళ్లకుండా కాంగ్రెస్ పార్టీ లోనే నిరంతరం ఒక సేవకుడిగా ఇప్పటివరకు సేవలందిస్తున్నందుకు గాను ఈ సందర్భంగా పూలమాల వేసి శాలువాతో సత్కరించడం జరిగింది. అలాగే కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మేడిశెట్టి ఉమాశంకర్ సన్మానించడం జరిగింది. తదనంతరం పోకల దేవదాసు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి తను చేసిన సేవను గుర్తిస్తూ సన్మానించిన ప్రతి నాయకునికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోమటిరెడ్డి చిన్న వెంకట్ రెడ్డి, పందిరి శ్రీనివాసులు, మారగోని ఆంజనేయులు, వనమా వెంకటేశ్వర్లు, జడల చిన్న మల్లయ్య, ఎస్.కె ఇబ్రహీం, మరియు మాజీ కౌన్సిలర్లు మార్కెట్ డైరెక్టర్లు కాంగ్రెస్ నాయకులు వివిధ హోదాల్లో ఉన్న కాంగ్రెస్ నాయకులకు తదితరులు పాల్గొన్నారు.

## బస్తీల ఏర్పాటులో పీజేఆర్ పాత్ర మరువలేనిది

**హైదరాబాద్, విశాలభారతి:** ఖైరతాబాద్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు , ప్రజానేత పి. జనార్ధన్ రెడ్డి 18 వ వర్ధంతి సందర్భంగా పీజేఆర్ విగ్రహానికి అర్పించిన పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట్ స్వామి, అజారుద్దీన్ , కార్పొరేటర్ విజయ రెడ్డి, ఇతర ముఖ్య నేతలు ఘన నివాళులర్పించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీర్చుతూ కృష్ణ , గోదావరి జలాలు తరలించడంలో పీజేఆర్ కృషి ఎనలేనిది, హైదరాబాద్ ఇంచార్జి మంత్రిగా సమీక్షా సమావేశాల్లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఆయన చేసిన సేవలు ,హైదరాబాద్ తాగునీటికి ఆయన పాత్ర ను గుర్తు చేసుకుంటాం. పోతిరెడ్డి పాడు దోపిడిని తెలంగాణ ఉద్యమకారుడిగా వ్యతిరేకించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా కార్మిక నాయకుడిగా ఎనలేని సేవ చేశారు. నగరంలో గుడిసెలను ఏర్పాటు చేయడంలో కాకా గుడిసెల వెంకట్ స్వామి కృషి చేస్తే అనేక బస్తీలు ఏర్పాటు చేయడంలో పీజేఆర్ పాత్ర మరువలేనిది అని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మా గాంధీ పోరాడితే.. ఆయనను చంపిన గాడ్సేను బీజేపీ వాళ్లు ఆరాధిస్తున్నారని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. రాజకీయ కక్షతోనే పథకాల పేర్లు మార్చేస్తున్నారని ఫైరయ్యారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఇటీవల గెలిచిన సర్పంచ్ లను శనివారం కరీంనగర్ ఇందిరా గార్డెన్స్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో కలిసి ఆయన సన్మానించారు. అలాగే హుస్నాబాద్‌లో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. స్థానికంగా ఉపాధి కల్పించి, వలసలను నివారించాలనే గొప్ప సంకల్పంతో సోనియా గాంధీ నాయకత్వంలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చారని గుర్తు చేశారు. పథకం పేరును 'వి.బి. రామ్ జీ'గా మారుస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయం.. గాంధీ, నెహ్రూల వారసత్వాన్ని తుడిచిపెట్టే కుట్రలో భాగమేనని ఆరోపించారు.





# న్యూఇయర్ సర్‌ప్రైజ్..

## ఓటీటీలో కొత్త మూవీ 'మోగ్లీ'

తన ప్రేమ కోసం యుద్ధం చేస్తున్న ప్రతివాడూ హీరోనే అంటూ థియేటర్స్‌లో సందడి చేశాడు మోగ్లీ. రోషన్ కనకాల, సాక్షి మడోల్కర్ జంటగా సందీప్‌రాజ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రమిది. డిసెంబరు 13న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ యువతను ఆకట్టుకుంది.

నాయకానాయికల జోడీ, ప్రతినాయకుడి పాత్ర, విజువల్స్, సంగీతం ఈ సినిమాకు అదనపు బలాన్ని ఇచ్చాయి. ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించడానికి ఈ మూవీ సిద్ధమైంది. కొత్త సంవత్సరం కానుకగా తెలుగు ఓటీటీ వేదిక 'ఈటీవీ విన్'లో జనవరి 1వ తేదీ నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఈటీవీ విన్ పోస్టర్‌ను పంచుకుంది.

ఇంతకీ కథేంటంటే..

మురళీకృష్ణ అలియాస్ మోగ్లీ (రోషన్ కనకాల) ఓ అనాథ. ఎస్సై కావాలనేది లక్ష్యం. చిన్నప్పుడే తల్లిదండ్రుల్ని కోల్పోయిన మోగ్లీ ఊరి పక్కన ఉన్న అడవినే తన అమ్మగా భావిస్తూ.. చిత్రీకరణల కోసం వచ్చే సినిమా యూనిట్స్‌కు సాయం చేస్తూ జీవనోపాధి పొందుతుంటాడు. అలా ఓ సినిమాకి డూప్‌గా నటించాల్సి వస్తుంది. ఆ క్రమంలోనే ఆ చిత్రబృందంలో డాన్సర్ అయిన జాస్మిన్ (సాక్షి మడోల్కర్)ని చూసి మనసు పారేసుకుంటాడు. ఆమె వినలేదు, మాట్లాడలేదు. అయినా ఇద్దరి మనసులు కలుస్తాయి. తాను రాముడైతే, జాస్మిన్ సీత అంటాడు మోగ్లీ. అంతా సవ్యంగా సాగిపోతుందనుకుంటే సీతారాముల్లాంటి ఆ జంట మధ్యకు రావణుడిలా వస్తాడు క్రిస్టోఫర్ నోలన్ (బండి సరోజ్‌కుమార్) అనే ఎస్సై. సీత లాంటి జాస్మిన్‌పై కన్నేస్తాడు. ఎలాగైనా ఆమెని లోబరుచుకోవాలని పథకం పన్నుతాడు. దాంతో మోగ్లీ, జాస్మిన్ అరణ్యవాసం చేయాల్సి వస్తుంది. మోగ్లీ తన జాస్మిన్‌ని క్రిస్టోఫర్ నోలన్ నుంచి కాపాడుకోగలిగాడా, లేదా? అనేదే చిత్ర కథ.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.